ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts
సంపుటి - 02 సంచిక -83 పేజీలు - 08 వెల - 06/- శనివారం 5 జులై 2025

# వారసత్వ భూములకు సెక్షన్ సర్టిఫికెట్

## రెవెన్యూ సమీక్షలో సీఎం చంద్రబాబు



**ప్రతి పేదవాడికి నివాస స్థలం**

**రెండేళ్లలో స్థలం..మూడేళ్లలో ఇల్లు**

**జర్నలిస్టులకు స్థలాలపై మంత్రివర్గ కమిటీ**

**టెక్నాలజీ ద్వారా రెవెన్యూ శాఖలో మార్పులు**

**వివరాలు వెల్లడించిన మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడి**

అమరావతి,**జులై 04 (రిపబ్లిక్ న్యూస్)** వారసత్వ భూములకు సెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. రూ. 10లక్షల వరకు విలువైన వారసత్వ భూములకు సచివాలయంలో రూ. 100 చెల్లించి సెక్షన్ సర్టిఫికెట్లు పొందే వెసులుబాటు కల్పిస్తున్నట్లు చెప్పారు. రూ. 10లక్షలు దాటిన భూములకు రూ.వెయ్యి చెల్లించి సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలను ఆగస్టు 2లోగా మంజూరు చేయాలని అధికారుల్ని సీఎం ఆదేశించారు. మెజార్టీ రెవెన్యూ సమస్యలను అక్టోబరు 2లోగా పరిష్కరించాలని సూచించారు.రెవెన్యూ శాఖపై సమీక్ష సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.
హౌసింగ్ ఫర్ ఆల్‌లో భాగంగా ప్రతీ పేదవాడికి నివాస యోగ్యం అయిన ఇళ్లు ఉండాలని నిర్ణయించామని.. రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. రెండు సంవత్సరాల్లో ఇంటి స్థలం.. మూడు సంవత్సరాల్లో ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. రెవెన్యూకు సంబంధించి పది అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష చేశారని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.మిగతాది 2లో...



# ప్రకాశం జిల్లాలో 1290 కోట్లతో తాగునీటి ప్రాజెక్ట్

## శంకుస్థాపన చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



- జల్‌జీవన్ మిషన్‌కు అత్యంత ప్రాధాన్యం
- గత ప్రభుత్వం ఈ పథకాన్ని పట్టించుకోలేదు
- మంచినీటి సమస్య తీర్చేందుకు ప్రత్యేక శ్రద్ధ
- వైకాపా బెదిరింపులకు భయపడేది లేదు
- వారు మళ్లీ అధికారంలోకి రావడం కల్ల

ఒంగోలు,**జులై 04 (రిపబ్లిక్ న్యూస్)**
గత జగన్ ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్‌ను పట్టించుకోలేదని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరోపించారు. దీంతో గ్రామాలకు శుద్ధజలాలన్ని అందించే అవకాశం లేకుండా పోయిందని అన్నారు. మిగతాది 2లో...



# హైదరాబాద్‌లో మాజీ సీఎం రోశయ్య విగ్రహం

**లక్డీకాపూల్‌లో ఆవిష్కరించిన మల్లికార్జున ఖర్గే**

హైదరాబాద్,**జులై 04 (రిపబ్లిక్ న్యూస్)** నగరంలోని లక్డీకాపూల్‌లో మాజీ సీఎం కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆవిష్కరించారు. రోశయ్య జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం నేతలు నివాళి అర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. వైఎస్ మరణం తరవాత ఆయన సిఎంగా పనిచేశారు. తరవాత తమిళనాడు గవర్నర్‌గా వెళ్లారు. ఆయన సేవలకు గుర్తుగా ప్రభుత్వం విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే చేతుల మీదుగా ఆవిష్కరించిన ఈ కార్యక్రమంలోసీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, రోశయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కార్యకర్తలు కూడా భారీగా తరలివచ్చారు.

# ‘నైపుణ్యం’ పోర్టల్

## ఉద్యోగాల కల్పనకు మిషన్‌మోడ్

**రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు**

**సెప్టెంబర్ 1 నాటికి ‘నైపుణ్యం’ పోర్టల్ ప్రారంభించాలని అధికారులకు మంత్రి లోకేష్ ఆదేశం**

**ప్రతి మూడు నెలలకు ఒకసారి నియోజకవర్గాల్లో జాబ్ మేళాల నిర్వహణ**

**ఐటీఐల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.600 కోట్ల నిధులు కేటాయింపు**

**విదేశీ ఉద్యోగాల కోసం దేశాల రాయబార కార్యాలయాలతో సంప్రదింపులు జరపాలని సూచన**

**పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుంటే ఆటోమేటిక్‌గా రెజ్యూమ్ తయారయ్యేలా ఏర్పాట్లు**





అమరావతి,**జులై 04 (రిపబ్లిక్ న్యూస్)** రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా.. యువత, పరిశ్రమలను అనుసంధానించేలా కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న సింగిల్ ప్లాట్ ఫామ్ ‘నైపుణ్యం పోర్టల్’ను సెప్టెంబర్ లో ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు.



# ఏపీలో తక్షణమే రాష్ట్రపతి పాలన విధించాలి

**ఏపీలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని జగన్ ఆరోపణ**

**గుంటూరు జిల్లా దళిత సర్పంచ్‌పై దాడిని ప్రస్తావించిన జగన్**

**వైసీపీ శ్రేణులపై పథకం ప్రకారమే దాడులు జరుగుతున్నాయని వ్యాఖ్య**

**సీఎం చంద్రబాబుకు పదవిలో కొనసాగే అర్హత లేదంటూ విమర్శ**

అమరావతి,**జులై 04 (రిపబ్లిక్ న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, తక్షణమే రాష్ట్రపతి పాలన విధించాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రాజకీయ నాయకులకు, సాధారణ పౌరులకు రక్షణ కరువైందని, ఈ పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని కాపాడలేని ప్రభుత్వానికి అధికారంలో ఉండే అర్హత లేదని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు.మిగతాది 2లో...

# తెలంగాణకు మోదీ ఏం చేశారు?

**హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ సామాజిక న్యాయ సమరభేరి సభ**

**ప్రధాని మోదీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు**

**మణిపూర్‌కు వెళ్లని ప్రధాని 42 దేశాలు తిరిగారని ఎద్దేవా**

**తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నిలబెట్టుకుంటోందని వెల్లడి**

**దేశంలో తొలిసారి కులగణన చేపట్టింది తెలంగాణ ప్రభుత్వమేనని స్పష్టీకరణ**



హైదరాబాద్,**జులై 04 (రిపబ్లిక్ న్యూస్)**
దేశం కోసం గాంధీ కుటుంబం ప్రాణత్యాగం చేసిందని గుర్తుచేశారుఆపరేషన్ సిందూర్‌కు రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలిపిందని, అయితే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాకిస్థాన్‌తో యుద్ధాన్ని మధ్యలోనే నిలిపివేశారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. పాకిస్థాన్‌తో యుద్ధానికి తాము మద్దతు ఇచ్చామని ఆయన స్పష్టం చేశారు.మిగతాది 2లో...

# మోడీకి ట్రినిడాడ్ అత్యున్నత పౌర పురస్కారం

**ది ఆర్డర్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్, అండ్ టొబాగో తో సత్కారం**



2లో

# చదువంటే కేవలం డిగ్రీలు కాదు

**నైపుణ్యాలపై దృష్టి సారించి సాగండి**

**కాకినాడ జేఎన్టీయూ 11వ స్నాతకోత్సవంలో గవర్నర్**




2లో

# వారసత్వ భూములకు సెక్షన్ సర్టిఫికెట్

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం ఏడాది కాలంగా రెవెన్యూ శాఖ పనితీరుపై సీఎం సమీక్ష చేశారు. సమావేశం అనంతరం మంత్రి అనగాని మీడియాతో మాట్లాడుతూ.. పది లక్షల రూపాయలు వరకూ భూమి విలువ ఉంటే సక్సెన్ సర్టిఫికెట్ కోసం గ్రామ సచివాలయంలోనే 100 రూపాయలు ఫీజు చెల్లించి పొందవచ్చన్నారు. 10 లక్షలపైన విలువ ఉంటే వెయ్యి రూపాయలు ఫీజుగా నిర్ణయించినట్లు తెలిపారు. టెక్నాలజీ ద్వారా రెవెన్యూశాఖలో సమూల మార్పులకు ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం రీ సర్వే చేయకుండానే ఫోటోల పిచ్చితో ఇష్టానుసారం చేశారని ఫైర్ అయ్యారు. 200-250 ఎకరాలకు మించకుండా బ్లాక్ సిస్టం పెట్టి చేశారన్నారు. రీసర్వేపై ప్రతీ మూడు నెలలకు ఒకసారి రివ్యూ చేస్తామన్నారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చే పాస్ బుక్ క్యూ ఆర్ కోడ్ అనేది భూమి జీపీఎస్ కూడా చూపుతుందని పేర్కొన్నారు. ఆగష్టు 15న పండగ వాతావరణంలో అందరికీ పాస్ పుస్తకాలు అందిస్తామని ప్రకటించారు. ప్రభుత్వ ప్రైవేటు భూములకు వేర్వేరు రంగులతో మ్యాప్‌లు సిద్ధం చేస్తున్నారని.. అధికారులు ప్రోటోకాల్‌పై ఉండిపోవడంతో అన్ని ఇబ్బందులు వస్తున్నాయన్నారు. మంత్రులు ఎవరు వెళ్లినా ప్రోటోకాల్ రెవెన్యూ శాఖ పర్యవేక్షణలో ఆయా డిపార్టమెంట్
అధికారులే చూస్తారన్నారు. సూపర్ సిక్స్‌లో ఇచ్చిన



హమీలన్నీ అమలు చేస్తున్నామన్నారు. శ్మశానాలకు స్థలాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి చెప్పారు.జర్నలిస్టు హౌసింగ్‌కు పేదల హౌసింగ్‌కు ముగ్గురు మంత్రులతో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశామని.. మంత్రి వర్గ ఉపసంఘంలో రెవెన్యూ, మున్సిపల్, గృహ నిర్మాణ శాఖామంత్రులు ఉంటారని మంత్రి అనగాని తెలిపారు. ఫ్రీహోల్డ్ భూముల విషయంలో పది అంశాలు పరిగణలోకి తీసుకొని జీవోఎం అనేక మీటింగ్‌లు తీసుకున్నామని.. అక్టోబర్ 2 నాటికి ఈ అంశంపై కచ్చితమైన నిర్ణయం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. నాలుగు లక్షల 63 వేల గ్రీవెన్స్‌లు వస్తే దానిలో 3 లక్షల 90 వేలకు పైగా పరిష్కరించామన్నారు. అభ్యంతరం లేని భూముల విషయంలో జీవో 30 ద్వారా చేస్తున్నామని చెప్పుకొచ్చారు. రెవెన్యూ సదస్సులో తీసుకున్న అర్జీలకు చాలా వరకూ పరిష్కరించామని వెల్లడించారు. గత పాలకులు రెవెన్యూ వ్యవస్థను ఒక ఆర్థిక వనరుగా చూశారని విమర్శించారు. మద్యం తరహాలోనే ఇక్కడి నుంచి వారు, వారు అనునాయులు బాగుపడేలా చేసుకున్నారని మండిపడ్డారు.

నెల 9న జరగబోయే కేబినెట్ సమావేశంలో నాలా రద్దు విషయంలో చర్యలు తీసుకుంటామని.. లేని పక్షంలో ఆ తరువాత కేబినెట్‌లో అయినా తెస్తామన్నారు. సర్వే, రిజిష్ట్రేషన్, రెవెన్యూలో బ్లాక్ చెయిన్ టెక్నాలజీ తీసుకువచ్చి తప్పుడు రిజిష్ట్రేషన్లు జరగకుండా చూస్తామని పేర్కొన్నారు. దీన్ని వచ్చే కేబినెట్‌లో తీసుకువచ్చి అమలులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈరోజు డిపార్టమెంట్‌లో పోస్టుల గురించి మాట్లాడామన్నారు. అన్ని విషయాలపై చర్చించామన్నారు. సర్వేయర్లను రేషనలైజేషన్ చేస్తున్నారని... అయితే రీసర్వే జరిగే చోట సర్వేయర్లను మార్చేది లేదని తేల్చిచెప్పారు. మేము క్యూఆర్ కోడ్‌తో పాస్ పుస్తాకాలే కాదు ఆధార్‌తో కూడా కలుపుతున్నాం. తెలంగాణలో ధరణి పోర్టల్‌కు ఇక్కడ రెవెన్యూ పని తీరుకు చాలా తేడా ఉంది. మేము ఏం చేసినా పారదర్శకంగా చేస్తున్నాం. అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద జీవో నెంబర్ 84 ప్రకారం 50 శాతం ఫీజు కట్టారు. రెండేళ్లుగా రెగ్యూలరైజ్ చేసేందుకు ఎదురు చూస్తున్నారు. ఇలాంటి కేసులు విజయవాడ, గుంటూరు, తిరుపతి, విశాఖలలో 354 ఉన్నాయి. వాటిపై ఈ నెల 9న జరిగే జీవోఎంలో చర్చించి ముందుకు వెళతాం. పరిష్కారం చూపి న్యాయం చేసేస్తాం' అని మంత్రి అనగాని సత్య ప్రసాద్ పేర్కొన్నారు.

# ప్రకాశం జిల్లాలో 1290 కోట్లతో
# తాగునీటి ప్రాజెక్ట్



(మొదటి పేజీ తరువాయి)

అలాగే గత వైసీపీ ప్రభుత్వంలో ప్రకాశం జిల్లాని అభివృద్ధి చేయకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. వెలుగొండ ప్రాజెక్ట్ పనులని పూర్తిగా నిర్లక్ష్యంగా గాలికి వదిలి వేశారని విమర్శించారు. గత పాలకులు రౌడీయిజం, గుండాయిజంలను మాత్రమే నమ్ముకున్నారని ధ్వజమెత్తారు. శుక్రవారం ప్రకాశం జిల్లాలోని మార్కాపురంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటించారు. మార్కాపురం మండలం నరసింహాపురం వద్ద రూ. 1290 కోట్లతో జల్ జీవన్ మిషన్ పనులకి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భారీ బహిరంగ సభలో పవన్ కల్యాణ్ ప్రసంగించారు. తమ ప్రభుత్వం కక్ష తీర్చుకునేది కాదని... తప్పులు చేస్తే శిక్షించే ప్రభుత్వమని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. వ్యక్తిగతంగా తనకు ఎవరిపైనా కోపం లేదని చెప్పుకొచ్చారు. కుత్తుకలు కోస్తాం అనే వైసీపీ తాటాకు చప్పుళ్లకు భయపడమని అన్నారు. మళ్లీ అధికారంలోకి ఆ పార్టీ నేతలు ఎలా వస్తారో చూద్దామని చెప్పారు. వైసీపీకి 151 సీట్లు వచ్చి... తాను రెండు చోట్ల ఓడినప్పుడు కూడా వారిని ఎదిరించానని గుర్తుచేశారు. సినిమా డైలాగులు నిజజీవితంలో బాగుండవని చెప్పుకొచ్చారు. తలదించుకుని పనిచేస్తున్న వారిని రెచ్చగొట్టవద్దని హితవు పలికారు. సామాన్యులను బెదిరించడం వల్లే వైసీపీకి ఈ దుస్థితి వచ్చిందని పవన్ కల్యాణ్ విమర్శించారు. 'నేను ప్రభుత్వ ఉద్యోగి కొడుకును కాబట్టి ప్రకాశం, నెల్లూరుతో సహా ఐదారు జిల్లాల్లో తిరిగాను. నెల్లూరులో నాకు ఇంటర్‌మీడియట్ సీట్ ఆనం వివేకానంద రెడ్డి ఇప్పించారు. ప్రకాశం జిల్లా అంటే గుర్తుకు వచ్చేది ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు. సైమన్ కమిషన్‌కి ఎదురొడ్డి నిలిచిన ధైర్యవంతుడు ప్రకాశం పంతులు. ప్రకాశం జిల్లాలో అపారమైన ఖనిజాలు ఉన్నాయి. జగన్ హయాంలో అభివృద్ధిలో ఈ జిల్లాని పూర్తిగా నిర్లక్ష్యానికి గురిచేశారు. దశాబ్దాలుగా వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తి చేయలేదు. ఒంగోలులో రెండు సంవత్సరాలు, కనిగిరిలో ఆరు నెలలు మేము ఉన్నాం. కనిగిరిలో ఫ్లోరైడ్ సమస్యతో అక్కడి నుంచి మేము వెళ్లిపోయాం. జల్ జీవన్ పనులు మొదటి ప్రయారిటీ ప్రకాశం జిల్లాకి ఇచ్చామని అన్నారు. ప్రకాశం జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కరించడమే ప్రధాన లక్ష్యం. వెలిగొండ ప్రాజెక్టుకు రూ.4 వేల కోట్లు కావాలి. జల్ జీవన్ మిషన్ పథకాన్ని ఆపేస్తున్నామని కేంద్రం మాకు చెప్పింది. నీళ్లు ఇవ్వడం అన్నది రాష్ట్రానికి సంబంధించింది. కేంద్ర మంత్రి పాటిల్‌ను కలిసి అన్ని విషయాలు వివరించా. నీటి ఎద్దడి ప్రాంతాలకు రూ.84 వేల కోట్లు అవసరమవుతాయని చెప్పాం. ప్రస్తుతం జల్ జీవన్ మిషన్ మొదటి విడత రూ.1,290 కోట్లతో శంకుస్థాపన చేసుకున్నాం. స్వాతంత్ర్యం వచ్చాక తొలిసారిగా ప్రకాశం జిల్లాలో అతిపెద్ద తాగునీటి పథకమిదే. దాదాపు 10 లక్షలకు పైచిలుకు జనాభాకు తాగునీటిని అందించబోతున్నాం అని వివరించారు.

గత పాలకులు రూ.లక్షల కోట్లు అప్పులు పెడితే వాటన్నింటిని తట్టుకుని ఇవాళ ముందుకెళ్తున్నాం. వారి హయాంలో ఎలాంటి తాగునీటి పథకం చేపట్టలేదు. ఎన్నికల ముందు శిలాఫలకాలు వేసేందుకే పరిమితమయ్యారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నాం. సకాలంలో నిధులు వస్తే 18 నుంచి 20 నెలల్లో పూర్తి చేస్తాం. నేను ప్రత్యేకించి ఈ పథకాన్ని పర్యవేక్షిస్తా. లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం భూములు దోచుకోవాలనుకుంటే అంతే సంగతి. వైకాపా హయాంలో ఎక్కడ ఖాళీ భూములు కనిపించినా వాటిని దోచేశారు. ఆక్రమణకు గురైన ఆలయాల భూములను తిరిగి వెనక్కి తీసుకునే పక్రియ ప్రారంభించాం. వాటికి రక్షణ కల్పించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుందని పవన్ కల్యాణ్ అన్నారు. కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డోలా బాలవీరాంజనేయ స్వామి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణకు మోదీ ఏం చేశారు?

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన 'కాంగ్రెస్ సామాజిక న్యాయ సమరభేరి' సభలో ఖర్గే ప్రసంగిస్తూ, ఇప్పటివరకు 42 దేశాల్లో పర్యటించిన ప్రధానమంత్రికి మంటల్లో కాలుతున్న మణిపూర్‌ను సందర్శించడానికి సమయం లేకపోవడం విచారకరమని అన్నారు. మణిపూర్ మన దేశంలో భాగం కాదా అని ప్రశ్నించిన ఆయన, అక్కడి ప్రజల బాధలను విన్న తర్వాతనే విదేశీ వ్యవహారాలపై దృష్టి సారించాలని మోదీకి సూచించారు.గతంలో అమెరికా బెదిరించినా ఇందిరా గాంధీ భయపడలేదని, కానీ ట్రంప్ ఫోన్ చేయగానే పాకిస్థాన్‌తో యుద్ధాన్ని మోదీ ఆపేశారని ఖర్గే ఆరోపించారు. దేశం కోసం ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ప్రాణ త్యాగం చేశారని, బీజేపీ, ఆర్ఎస్ఎస్ నుంచి ఒక్కరైనా దేశం కోసం ప్రాణాలను అర్పించారా అని ఆయన ప్రశ్నించారు. ప్రధాని మోదీ, అమిత్ షా అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చారని విమర్శించారు.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కృషితోనే అధికారంలోకి వచ్చిందని ఖర్గే పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమష్టిగా పనిచేసి బీఆర్ఎస్‌ను ఓడించారని ప్రశంసించారు. కేసీఆర్ తన పాలనలో రైతులను, మహిళలను, నిరుద్యోగులను మోసం చేశారని ఆరోపించారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందని ఖర్గే తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో రూ. 8,200 కోట్లు జమ చేయడం, పేదలకు సన్న బియ్యం వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. దేశంలోనే తొలిసారిగా కుల గణన చేపట్టింది తెలంగాణ ప్రభుత్వమేనని అన్నారు. గిగ్ వర్కర్ల హక్కుల కోసం చట్టం తీసుకువస్తున్నామని ఆయన వెల్లడించారు.

# పీ-4 అమలులో ఏపీ ప్రభుత్వం కీలక అడుగులు

## అమలు కావడం కోసం రెండు కమిటీలు ఏర్పాటు -జిల్లాల కలెక్టర్లతో వీడియ కాన్ఫరెన్స్‌లో చంద్రబాబు

**అమరావతి,జులై 04 (రిపబ్లిక్ న్యూస్)**

పీ-4 అమలులో ఏపీ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తుంది. అందులో భాగంగా పీ 4 భవిష్యత్తు కార్యాచరణపై సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీ-4 పథకం సమర్థవంతంగా అమలు కావడం కోసం రెండు కమిటీలు ఏర్పాటు- చేయాలని నిర్ణయించారు. పీ -4 అమలు, పర్యవేక్షణ కోసం జిల్లా, నియోజకవర్గ స్థాయి ఛాప్టర్లు ఏర్పాటు-కు ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఈ కమిటీ-ల్లో ఇన్‌ఛార్జ్ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా, నియోజకవర్గం స్థాయి అధికారులు సభ్యులుగా ఉండనున్నారు. ఇక పీ-4 లోగోను సీఎం చంద్రబాబు ఖరారు చేశారు. ఆగస్టు 15వ తేదీ నాటికి 15 లక్షల బంగారు కుటు-ంబాలు, లక్ష మంది మార్గదర్శకులను గుర్తించేలా లక్ష్యంగా నిర్దేశిరచుకున్నారు. పీ-4 అమల్లో బాపట్ల జిల్లా నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. అదే విధంగా పీ-4 పథకం అమలుపై ప్రజల్లో నెలకొన్న సందేహాలను ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు దృష్టికి ఎమ్మెల్యేలు తీసుకు వెళ్లారు. పీ-4 వల్ల సంక్షేమ పథకాల్లో కోత ఉండదని.. ఇది సంక్షేమానికి అదనమని ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.పీ-4 పథకంపై ప్రజల్లోని అపోహలను తొలగించాలని వారికి ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఆదేశించారు. బంగారు కుటుంబాలకు సరైన సమయంలో సహకారం.. నిరంతర గైడెన్స్ ఇవ్వడమనేది మార్గదర్శకులు బాధ్యతగా తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ రోజు జరిగిన స్వర్ణాంధ్ర పీ 4 ఫౌండేషన్ తొలి జనరల్ బాడీ సమావేశం కావడంతో... మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా, మండల
స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఇక జూమ్‌లో జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు, జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరయ్యారు.

# ఏపీలో తక్షణమే రాష్ట్రపతి పాలన విధించాలి

(మొదటి పేజీ తరువాయి)

"ఏపీలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా క్షీణించింది. రెడ్‌బుక్, పొలిటికల్ గవర్నన్స్‌లతో ఆంధ్రప్రదేశ్ రక్తమోడుతోంది. వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలపై ఒక పథకం ప్రకారం తప్పుడు కేసులు పెడుతూ అరెస్టులు చేయిస్తున్నారు. అదీ వీలుకాకపోతే, తమవాళ్లని ప్రోత్సహించి మరీ దాడులు చేయిస్తున్నారు. గుంటూరు జిల్లా మన్నవ గ్రామ దళిత సర్పంచి నాగమల్లేశ్వర్రావును పట్టపగలే కొట్టి చంపేప్రయత్నంచేశారు. దీనికి సంబంధించిన వైరల్ అయిన వీడియో రాష్ట్రంలో మాఫియా, దుర్మార్గపు పాలనను తెలియజేస్తోంది. నాగమల్లేశ్వర్రావు కుటుంబం మొదటినుంచి వైసీపీలో ఉండడం, ప్రజల్లో వారికి మంచి గుర్తింపు ఉండడం టీడీపీ వారికి కంటగింపుగా మారింది. పలుమార్లు బెదిరించినా, భయపెట్టినా వెనకడుగు వేయకపోవడంతో, రాజకీయంగా అక్కడ, ఆ ప్రాంతంలో వైసీపీ ప్రాబల్యాన్ని తట్టుకోలేక స్థానిక ఎమ్మెల్యే తన కార్యకర్తలను పురిగొల్పి ఈ దాడులు చేయించారు. ఆ వీడియోలు చూస్తే, జరిగిన దాడి ఎంత అన్యాయమో, ఎంత హేయమో కనిపిస్తుంది. చంద్రబాబు గారు స్వయంగా ప్రోత్సహిస్తూ, తన వాళ్లతో చేయిస్తున్న ఈ దారుణాలతో, వరుసగా జరుగుతున్న ఘటనల నేపథ్యంలో, రాష్ట్రంలో ఎవ్వరికీ రక్షణలేని పరిస్థితులు నెలకొన్నాయి. మాఫియా తరహాలో రాష్ట్రాన్ని నడుపుతున్న చంద్రబాబుకు అసలు పదవిలో ఉండే అర్హత ఉందా? రాజకీయ నాయకులకు, పౌరులకు రక్షణ లేని ఈ రాష్ట్రంలో, రాజ్యాంగాన్ని, చట్టాన్ని ఉల్లంఘిస్తూ, లా అండ్ ఆర్డర్ కాపాడలేని పరిస్థితుల్లో రాష్ట్రపతి పాలన ఎందుకు పెట్టకూడదని ప్రశ్నిస్తున్నాను" అంటూ జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# 'నైపుణ్యం' పోర్టల్

(మొదటి పేజీ తరువాయి)

ఉండవల్లి నివాసంలో నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారులతో నేడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధి కల్పనకు మిషన్ మోడ్ విధానంలో నైపుణ్యం పోర్టల్ ను ప్రజల్లోకి తీసుకెళతామని వెల్లడించారు. ఇందులో 90 రోజులపాటు ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని చెప్పారు. ఈ మేరకు సెప్టెంబర్ 1 నాటికి నైపుణ్యం పోర్టల్ ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలకు అనుగుణంగా నైపుణ్యం పోర్టల్ ను తీర్చిదిద్దుతున్నట్లు ఈ సందర్భంగా అధికారులు వివరించారు. మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ.. నైపుణ్యం పోర్టల్ లో ప్రతిఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత ఆటోమేటిక్ గా రెజ్యుమ్ సిద్ధమయ్యేలా పోర్టల్ ను తీర్చిదిద్దాలని ఆదేశించారు. అలాగే స్కిల్ అసెస్ మెంట్, అన్ని కంపెనీల్లోని ఖాళీగా ఉన్న ఉద్యోగాల అవకాశాలను యువతకు తెలియజేసి తగిన నైపుణ్యాన్ని పెంపొందించి వారికి ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమగ్ర సమాచార సేకరణకు వివిధ విభాగాలతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి మూడు నెలలకోసారి నియోజకవర్గాల్లో జాబ్ మేళాల నిర్వహణకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా ఉపాధి కల్పన కార్యాలయాల పనితీరుపై కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రాన్ని క్లస్టర్ల వారీగా విభజించి నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించే అంశంపై అధికారులు మంత్రికి వివరించారు.ఇటీవల ఢిల్లీ పర్యటన అనంతరం ఐటీఐల అభివృద్ధికి హబ్ అండ్ స్పోక్ విధానంలో కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం ద్వారా రూ.600 కోట్లు కేటాయించడం జరిగిందని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. ఓమ్ క్యాప్ విభాగంపైనా సమావేశంలో చర్చించారు. విదేశాల్లో ఉద్యోగ, ఉపాధి కల్పనను మరింత సులభతరం చేసేలా ఆయా దేశాల రాయబార కార్యాలయాలతో సంప్రదింపులు జరపాలని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ సూచించారు. ఈ సమావేశంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ విభాగం కార్యదర్శి కోన శశిధర్, ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఎండీ, సీఈవో జి.గణేశ్ కుమార్, కాలేజి ఎడ్యుకేషన్ డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా, ఇంటర్నేషనల్ స్కిల్లింగ్ అండ్ మొబిలిటీ అడ్వైజర్ సీత శర్మ, ఏపీఎస్ఎస్ డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.రఘు తదితరులు పాల్గొన్నారు.

# చదువంటే కేవలం డిగ్రీలు కాదు

## నైపుణ్యాలపై దృష్టి సారించి సాగండి

## కాకినాడ జేఎన్టీయూ 11వ స్నాతకోత్సవంలో గవర్నర్



కాకినాడ,జూలై4(ఆర్ఎన్ఎ): చదువంటే డిగ్రీలు, బట్టీ పట్టడం, 100 కి 100 మార్కులు సాధించడం కాదని ఏపీ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తయింది అంటే ఇంతటితో విద్య పూర్తయినట్లు- కాదని.. ఇదే మీ కలలను సాకారం చేసుకునేందుకు ఆరంభమని చెప్పారు. యువత ధైర్యంగా, విభిన్నంగా ఆలోచించాలని.. సమస్యలను ఎదుర్కొని విజయబావుటా ఎగరేయాలని సూచించారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కాకినాడ జేఎన్టీయూ 11వ స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్సిటీలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఆయన అవార్డులు, గోల్డ్ మెడల్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ సరికొత్త బోధనా పద్ధతులతో డిజిటల్ ప్లాట్ ఫాంను ఏర్పాటు- చేయాల్సిన బాధ్యత విశ్వవిద్యాలయాదే. క్వాంటమ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐఓటి, ఇ-మొబిలిటీ- వంటి సాంకేతికతను మరింత ముందుకు తీసుకువెళ్లాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2026 నాటికి దేశంలోనే మొట్ట మొదటి పూర్తిస్థాయి స్టాక్ క్వాంటమ్ వ్యాలీని స్థాపించనుంది. క్వాంటమ్ మిషన్ వలన 2026 కల్లా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు- ద్వారా అమరావతిలో ఆవిష్కరణలు, ఉన్నతస్థాయి ఉపాధి, పర్యావరణ స్థిరత్వాన్ని పెంపొందించేందుకు అవకాశం లభిస్తుంది. సాఫ్ట్ స్కిల్స్, వ్యవస్థాపకత, పరిశ్రమలతో అనుసంధానమై సిలబస్ ను రూపొందించడం ద్వారా పట్టభద్రులు సవాళ్లను ఎదుర్కొనేలా తయారుచేయవచ్చని అన్నారు.ఈ సందర్భంగా అమెరికాలోని బోస్టన్ గ్రూప్ ఛైర్మన్ కోట సుబ్రమణ్యానికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. వర్సిటీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 40 మంది విద్యార్థులకు ఎండోమెంట్ అవార్డు, గోల్డ్ మెడల్స్ అందజేశారు. గ్రాడ్యుయేషన్ జీవితంలో ఒక మంచి చాప్టర్. ఇది ముగింపు కాదు. మీ కలల సాకారం చేసుకోవడానికి ఆరంభం. యూనివర్సిటీలు -టె-క్నాలజీపై ఫోకస్ పెట్టాలి. అమరావతి కేంద్రంగా క్వాంటం వ్యాలీ రాబోతోంది. అమరావతి అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని గవర్నర్ పిలుపునిచ్చారు.

# మోడీకి ట్రినిడాడ్
# అత్యున్నత పౌర పురస్కారం

న్యూఢిల్లీ,: భారత ప్రధాని నరేంద్ర మోడీకి ట్రినిడాడ్ అత్యున్నత పౌర పురస్కారం 'ది ఆర్డర్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్, అండ్ టొబాగో ' ను శుక్రవారం బహుకరించారు. ఈ దేశం ఓ విదేశీ నేతకు ఈ విశిష్ట గౌరవం ఆపాదించడం ఇదే తొలిసారి. ప్రస్తుతం ఈ కరీబియన్ దేశ పర్యటనలో ఉన్న మోడీ గౌరవార్థం ఇక్కడి ప్రెసిడెంట్ హౌస్‌లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు- అయింది. ప్రధాని మోడీ రాజనీతిజ్ఞత, ఆయన కార్యదక్షత, గ్లోబల్ సౌత్ ప్రాధాన్యతల , రెండు దేశాల మధ్య నిర్మాణాత్మక బంధం బలోపేతం వంటి పలు అంశాల నేపథ్యంలో ఈ పురస్కారం అందించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ క్రిస్టియనే కార్లా కంగలూ మోడీని ప్రశంసించారు. ప్రధాని మోడీ ఈ చిన్నదేశంలో రెండు రోజుల పర్యటనకు వచ్చారు. ఈ దేశ అత్యున్నత విశిష్ట పురస్కారానికి తనను ఎంపిక చేసినందుకు తాను ట్రినిడాడ్ టోబాగో ప్రజలకు కృతజ్ఞుడిగా ఉంటానని ప్రధాని తెలిపారు. తాను ఈ పురస్కారాన్ని 140 కోట్ల మంది భారతీయుల పక్షాన స్వీకరిస్తున్నానని తెలిపారు. రెండు మూడు రోజుల క్రితమే మోడీకి ఘనా దేశ విశిష్ట పురస్కారం అందింది. ఈ విధంగా ప్రధాని మోడీకి ఇప్పటివరకూ మొత్తం మీద 25 అంతర్జాతీయ స్థాయి గౌరవ పురస్కారాలు దక్కాయి. 180 సంవత్సరాల క్రితం బీహార్ ఇతర ప్రాంతాల నుంచి భారతీయులు ఈ దేశానికి వచ్చి స్థిరపడ్డారని, తరతరాలుగా ఈ దేశంతో మనకు అత్యంత పురాతన వారసత్వ బంధం ఉందని, ఇది మరింత పెనవేసుకుపోతోందని పురస్కార స్వీకరణ సభలో మోడీ తెలిపారు.

# చిన్న వయసులో తప్పిపోయి 32 ఏళ్ల తరువాత

## తల్లితండ్రులకోసం తిరిగోచ్చిన యువకుడు...

కర్నూలు జిల్లాలో కన్నీళ్లు పెట్టించే హృదయావిదారక ఘటన







**కర్నూలు ప్రతినిధి జూలై 04(రిపబ్లిక్ న్యూస్). స్టోరీ :**

**పిల్లలకు తల్లితండ్రుల ప్రేమ అనేది ప్రానమంతటి విలువైనది. తల్లితండ్రులు పిల్లలకు ఆస్తులు సంపాదించి పెట్టకపోయినా ప్రేమ ఆప్యాయతలు పంచాలి అంటారు పెద్దలు.అందులోనూ చిన్నపిల్లలు దైవంతో సమానం అంటారు అలాంటి పిల్లలు తప్పిపోతే అల్లారుముద్దుగా చూసుకున్న ఆ తల్లితండ్రుల బాధ వర్ణనాతీతం.కొన్ని సినిమాల్లో ఇలాంటి సీన్లు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయి. తప్పిపోయి తల్లిదండ్రులకు దూరమైన పిల్లవాడు పడే నరకయా తన ప్రేక్షకుల హృదయాలను కలచివేస్తుంది. అలాంటి సంఘటనే కర్నూలు జిల్లా ఆదోనిలో చోటుచేసుకుంది.3 ఏళ్ల వయసులో ఆడుకుంటూ రైలు బండి ఎక్కి తప్పిపోయిన ఆదోని యువకుడు వీరేష్ 32 ఏళ్ల తరువాత తల్లితండ్రుల కోసం తిరిగి వచ్చి వెతికిన సంఘటన అందరిని కంటతడి పెట్టిస్తుంది...**

కర్నూలు జిల్లా ఆదోని నియోజకవర్గానికి చెందిన వీరేష్ 1994 సంవత్సరం మధ్యకాలంలో తనకు 3 ఏళ్ల వయసు ఉన్నపుడు ఆదోని రైల్వే స్టేషన్ లో ఆడుకుంటూ తప్పిపోయి. మళ్ళీ 32 ఏళ్ల తరువాత తన తల్లి తండ్రులను వెతుకుంటూ ఆదోనికి వచ్చాడు. కొద్దిరోజులుగా ఆదోనిలో తిరుగుతుండగా కొంతమంది అతనిని పట్టుకుని అడగడంతో అసలు విషయం బయటపడింది.తన పేరు వీరేష్ అని తనది ఇదే ఊరు చిన్నపుడు రైలు బండి అక్కడంతో తప్పిపోయాను ఇప్పుడు తన తల్లి తండ్రులను వెతుకుంటూ వచ్చనానని చెప్పడంతో వాళ్ళు సోషల్ మీడియాలో అతని అభ్యర్ధనను పోస్ట్ చేసారు. అంతే కాకుండా తన తల్లి తండ్రులు ఆచూకీ లభించాలి అంటే వెంటనే సబ్ కలెక్టర్ ని కలవాలని సూచించారు. దింతో వీరేష్ కొంతమంది సహాయంతో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భారత్వాజ్ ను కలిసి జరిగినదంత వివరించి ఎలాగైనా తన తల్లి తండ్రుల ఆచూకీ తెలపాలని కోరడంతో సబ్ కలెక్టర్ మౌర్య భారత్వాజ్ రెవిన్యూ, మున్సిపల్, పోలీస్ అధికారులకు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అదే విదంగా వీరేష్ చెప్పిన వివరాలు తండ్రి జనార్దన్, నానమ్మ రామాంజణమ్మ అనే పేర్లను పత్రిక ప్రకటన ఇవ్వగా పత్రికా ప్రకటన చూసినటువంటి వీరేష్ మేనమామజగదీశ్ పోలీసుల సహాయంతో సబ్ కలెక్టర్ ను సంప్రదించి వీరేష్ తల్లిదండ్రులు నానమ్మ పాత ఫోటోలను చూయించి అతను తన భార్య లక్ష్మి అన్న కుమారుడే అని పూర్తి ఆధారాలతో సహా తెలపడంతో విచారణ చేపట్టిన సబ్ కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ రెవెన్యూ సిబ్బంది పోలీసులు నిజమేనని నిర్ధారించుకుని వీరేష్ నో కర్నూల్ లో నివాసం ఉంటున్నటువంటి జగదీష్ కుటుంబానికి అప్పజెప్పారు. చిన్నప్పుడు మూడేళ్ల వయసులో తప్పిపోయినటువంటి వీరేష్ ను చెన్నై పోలీసులు అనాధాశ్రమంలో ఉంచగా అక్కడి నుంచి మళ్లీ ముంబైలోని అనాధాశ్రమానికి తరలించడంతో ముంబైలోని అనాధాశ్రమంలోనే తనకు 21 సంవత్సరాలు వచ్చే వరకు ఉండి పదవ తరగతి ఆపై చదువులు పూర్తి చేసుకుని ఆర్థిక ఇబ్బందుల కారణంగా హెూటల్ మేనేజ్మెంట్ కోరుచును మధ్యలోనే ఆపేసి వివిధ హెూటల్లో వెయిటరుగా పనిచేసే వాడినని తెలిపారు. అనాధాశ్రమంలో ఉంటున్నప్పుడు అక్కడున్నటువంటి ఆశ్రమం సిబ్బందిని అధికారులను ఎంతగా వేడుకున్నా తన తల్లిదండ్రుల వద్దకు పంపించాలని అడిగినా కూడా ఫలితం లేకుండా పోయిందని ఇప్పుడు తన తల్లిదండ్రులను వెతుక్కుంటూ వస్తే చివరికి వాళ్లు మరణించాలన్న వార్త చాలా బాధ కలిగించినప్పటికీ కనీసం మేనత్త మామలు ఉండి నన్ను గుర్తించి అక్కున చేర్చుకునందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపాడు. అదే విదంగా వీరేష్ మేనత్త మాట్లాడుతూ చిన్నప్పటినుంచి తప్పిపోయిన తన మేనల్లుడు వస్తాడు వస్తాడు అని ఎంతో ఆశతో ఎదురు చూశానని ఎంతోమంది దేవుళ్లను మొక్కేనని తన మోర ఆలకించినటువంటి ఆ భగవంతుడు మళ్ళీ తన మేనల్లుడిని తన వద్దకు చేర్చారని భావోద్వేగానికి గురయ్యారు. మొత్తం మీద వీరేష్ కదా సుఖాంతం అవడంతో వీరేష్ కాదను విన్న వాళ్ళందరూ హృదయాలు చల్లించాయి...

## క్లస్టర్ యూనివర్సిటీ 4 సెమిస్టర్ పీజీ ఫలితాలు విడుదల

### వీసీ ఆచార్య వి. వెంకట బసవరావు



**కర్నూలు ప్రతినిధి జులై 04 (రిపబ్లిక్ న్యూస్)** క్లస్టర్ యూనివర్సిటీ 4 సెమిస్టర్ పీజీ ఫలితాలు రాయలసీమ యూనివర్సిటీ వీసీ, క్లస్టర్ యూనివర్సిటీ ఇంచార్జి వీసీ ఆచార్య వి. వెంకట బసవరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు శుక్రవారం విడుదల చేశారు. పరీక్షలు ఏప్రిల్ 15 నుండి 19 వరకు నిర్వహించామని, మొత్తం 51 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 51మంది విద్యార్థులు, ఉత్తీర్ణత సాధించారని క్లస్టర్ యూనివర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కే నాగరాజ్ శెట్టి తెలిపారు. 100% శాతం యూనివర్సిటీ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ సమావేశంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కే బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

## మొహరం ను ప్రశాంతంగా జరుపుకోండి...

### జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 4)** మొహరం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ శుక్రవారం జిల్లా ప్రజలకు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించి గొడవలకు దిగితే చట్టపరమైన చర్యలుంటాయన్నారు. గ్రామ పెద్దలు, చిన్న, పెద్ద తేడా లేకుండా ఉత్తేజభరితంగా జరుపుకునే ఈ వేడుకలలో అల్లర్లకు తావుండరాదన్నారు.అందరూ సోదరభావంతో మెలగాలని సూచించారు. చిన్న సరిగెత్తి, పెద్ద సరిగెత్తి మరియు జలధి కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో ముగిసే విధంగా సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.చట్ట విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మొహరం వేడుకలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించామన్నారు.

## కర్నూలు జిల్లా ఎస్పీ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు

### -అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి ఘన నివాళులు శౌ

### -అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా.





**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 4)**మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు గారి చిత్ర పటానికి అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.స్వాతంత్ర్యం కోసం సాయుధ పోరాటం చేసి ప్రాణాలర్పించిన యోధుడు , బ్రిటీష్ వారితో పోరాటాలు చేసిన అల్లూరి సీతారామరాజు గారి జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తి కావాలని అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ , ఎ ఆర్ డిఎస్పీ భాస్కర్ రావు, కమాండ్ కంట్రోల్ సిఐ శివశంకర్, ఆర్ ఐలు జావేద్, నారాయణ, సోమశేఖర్ నాయక్ , ఆర్ ఎస్సైలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, ఎఆర్ పోలీసులు ఉన్నారు.



## ఓర్వకల్లు మండల కేంద్రంలో పేరుకుపోయిన చెత్త

## రోడ్లపై నిలిచిపోయిన డ్రైనేజ్ వాటర్

**ఓర్వకల్లు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జులై 4)**

ఓర్వకల్లు కేంద్రంలో రోగాల బారిన పడుతున్న పట్టించుకోని అధికార యంత్రాంగం ఓర్వకల్ గ్రామంలో పలు కాలనీలలో ఎక్కడికి అక్కడ చెత్త పేరుకుపోయి డ్రైనేజీ నీళ్లు ఆగిపోయి కనీసం నడవడానికి కూడా దారి లేకుండా నీళ్లు ఆగిపోయాయి స్థానికంగా ఉన్న గ్రామస్తులు వాసనకు దోమలకు ఉండలేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎన్నిసార్లు అధికారులకు చెప్పిన అధికారులు సమస్యను పరిష్కరించడం లేదని గ్రామస్తులు ఈ సమస్యతో చిన్నపిల్లలకు పెద్దలకు సైతం రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు తెలియజేశారు అయితే ఇప్పటికైనా ఈ సమస్యపై ఉన్నత అధికారులు దృష్టిసాదించి కాలనీలు పరిశుభ్రంగా ఉంచాలని రోగాల భారి నుండి కాపాడాలని ఉన్నత అధికారులను కోరారు

## వైద్య విద్యార్థుల పట్ల కూటమి ప్రభుత్వం తీరు హేయమైన చర్య

### - కటికె గౌతమ్ రాష్ట్ర అధికార ప్రతినిధి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం

**కర్నూలు ప్రతినిధి జులై 04 (రిపబ్లిక్ న్యూస్)**

కర్నూలు నగరంలోని వైస్సార్సీపీ జిల్లా పార్టీ కార్యాలయం లో విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కటికె గౌతమ్, రాష్ట్ర కార్యదర్శి సాయి ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. వైస్సార్సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గౌతమ్ కటికే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుభూతిపరులైన కార్పొరేట్ శక్తులను ఆర్థికంగా పెంచి పోషించటం కోసమే వైద్య విద్య లో పీపీపీ పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్ విధానం కు శ్రీకారం చుట్టారు అని, ఈ పీపీపీ విధానం వల్లన పేద, మధ్య తరగతి విద్యార్థులు మెరిట్ ఉండి కూడా వైద్య విద్యకు దూరం అవుతున్నందున పీపీపీ విధానం అమలుకు వ్యతిరేకంగా వైస్సార్సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జులై 7,సోమవారం రోజున



విజయవాడ లో ఎన్టీఆర్ యూనివర్సిటీ ఉప కులపతికి మెమోరాండం ఇవ్వటం జరుగుతుంది. విద్యార్థి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం పరిపాలనలో రాష్ట్రము లో ఆటవిక పాలన కొనసాగుతుంది అని, యువ వైద్యులు అన్ని విద్యార్హతలు కలిగి ఉండి, వారి హక్కు అయినటువంటి పెర్మినెంట్ రిజిస్ట్రేషన్ పి ర్ ను అడిగితే పోలీసులచేత అగౌరవంగా ప్రవర్తింపజేసి, వారిని హింశించటం అన్యాయమైన చర్య అని. ఇది ప్రజాస్వామ్యమా రాచరికమా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇలాంటి సంఘటనల నేపథ్యంలో వైస్సార్సీపీ విద్యార్థి విభాగం భాధితుల పట్ల నిలబడి వారికి అండగా పోరాటం చేస్తుంది అని తెలియజేశారు. విద్యార్థి విభాగం కర్నూల్ సిటీ ప్రెసిడెంట్ అన్సార్ మాట్లాడుతూ విద్యార్థుల పైన జరుగుతున్న అన్యాయాలను సహించబోమని, రానున్న రోజులలో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకునేలా చేస్తాము అని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో విద్యార్థి విభాగం నాయకులు బి. శ్రీకాంత్ రెడ్డి,కోడుమూరు నియోజకవర్గం నాయకుడు శ్రీధర్,తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ప్రజలకు సేవలు చేద్దాం...

### జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్.బి. నవ్య..

**కర్నూలు ప్రతినిధి జూలై 4(రిపబ్లిక్ న్యూస్)**

పోరాట యోధులు స్వాతంత్ర సమరయోధుడు మన్యం వీరుడు శ్రీ అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ప్రజలకు సేవలు చేయాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ డాక్టర్.బి.నవ్య అల్లూరి జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పేర్కొన్నారు.శుక్రవారం ఉదయం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా యువజన సంక్షేమ శాఖ - సెట్కూరు మరియు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకల సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ డాక్టర్ బి. నవ్య మాట్లాడుతూ. అల్లూరి సీతారామరాజు జన్మదినం సందర్భంగా పోరాట యోధుడు , స్వాతంత్ర సమరయోధుడు కి ఘనంగా నివాళులు అర్పించుకోవడం మన బాధ్యత, ఆయన స్ఫూర్తితో మనం దేశభక్తి ని మరింత పెంచుకోవడం మరియు దేశ ప్రజలకు సేవ చేయడం మన కర్తవ్యం అని అన్నారు. ప్రభుత్వ సేవలో మనం ఉన్నాం కావున ఆ మహానుభావుడి స్ఫూర్తితో మనం ప్రజలకు మరింత గా సేవలు చేయాలని కోరారు. గిరిజన సంఘం నాయకులు గిరిజనుల పట్ల జరుగుతున్న అసమానతలను తెలిపారు. వాటిని దృష్టిలో పెట్టుకొని సరిచేసే చర్యలు చేపడతామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఎస్సీ , ఎస్టీ అట్రాసిటీలకు చెందిన సమస్యలను వెరిఫై చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మన జిల్లాలో ఉన్న ట్రైబల్ గ్రామాలకు మౌలిక వసతులు




,కావలసిన త్రాగు నీరు ,రోడ్లు ,కరెంటు మొదలగు సమస్యలను జిల్లా కలెక్టర్ వారి ఆధ్వర్యంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేస్తూ ఉండడం జరుగుతుందని ఇంకా మిగిలిపోయినవి ఏవైనా ఉంటే వాటిని కూడా జిల్లా అడ్మినిస్ట్రేషన్ అత్యంత ప్రాముఖ్యతను ఇచ్చి పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సీఈవో సెట్కూర్ వేణుగోపాల్ మాట్లాడుతూ... తెలుగువీర లేవరా దీక్షబోని సాగర అంటూ తెలుగుజాతిని చైతన్య పరిచిన అల్లూరి సీతారామరాజు కు ఘనంగా నివాళులు అర్పించుకుంటున్నాను ,ఆయన స్ఫూర్తితో ప్రజలకు సేవలు చేస్తామని, అల్లూరి సీతారామరాజు జీవితంలో జరిగిన సంఘటనలు సబికులకు తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ కేజీబీవీలో సీట్లు పెంచి గిరిజనులకు తప్పక ప్రవేశాలు కల్పించాలని, అన్యాయం జరిగిన గిరిజనులకు రావలసిన ఇంటి స్థలాలు,




ఇండ్లు, కాంపెన్సేషన్ లు మొదలగు బెనిఫిట్స్ అన్ని వెంటనే ఇప్పించే చర్యలు తీసుకోవాలని, ప్రతి మూడవ శనివారం ఎస్సీ /ఎస్టీ గ్రీవెన్స్ కు ఏర్పాట్లు చేయాలని కోరారు.

ఈ సమావేశానికి డి.అర్.ఓ. వెంకటనారాయణ మ్మ ,సెట్కూర్ సీఈవో డాక్టర్ వేణుగోపాల్, ఇన్చార్జి ట్రైబల్ ఆఫీసర్ ( యస్ డిసి) కొండయ్య, కలెక్టరేట్ ఏవో శివ రాముడు,టూరిజం అధికారి విజయ, సివిల్ సప్లై డైరెక్టర్ మహేష్ నాయుడు, తాహసిల్దార్ రమేష్, కలెక్టరేట్ సూపరిన్డెంట్లు గోవింద్ సింగ్, వెంకటేశ్వర్లు,శ్రీనాథ్,ఇంద్రాణి, ఎరుకల హక్కుల పోరాట సమితి నాయకులు ఎరుకల రాజు, కుశలన్న, హరి ,ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రామరాజు, చంద్రప్ప, వెంకటేష్, లంబాడ సంఘం నాయకులు యోగేష్ నాయక్, శంకర్ నాయక్, కైలాష్ నాయక్ లు మరియు ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

## ఉచిత కామన్ సర్వీస్ సెంటర్ ప్రారంభం

### జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప

**అనంతపురం, వైద్యం, జులై 04 ( రిపబ్లిక్ న్యూస్ ) :**




ఉమ్మడి జిల్లాలో వున్న మాజీ సైనికులు, వితంతువులకు, వీర నారీలకు రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ వి. వెంకట్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ సైనికుల పెన్షన్ సమస్యలను ఆన్ లైన్ ద్వారా సత్వర పరిష్కారం కోసం కేంద్రీయ సైనిక్ బోర్డ్ స్పర్స్ ( స్పర్శ్ సి ఎస్ సి ) ఉచిత కామన్ సర్వీస్ సెంటర్ ను శు క్రవారం జిల్లా సైనిక్ సంక్షేమ కార్యాలయములో ప్రారంభించామని జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప తెలిపారు. అనంతపురము, శ్రీ సత్య సాయి జిల్లాలలో వున్న మాజీ సైనికులు, వీర నారీలు , వితంతువులకు ఏవైనా పెన్షన్ సమస్యలు ఏవైనా ఉంటే నగరంలోని కోవూరు నగర్ లో మూడవ క్రాస్ లో ఉన్న జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయంలో నూతనంగా ప్రారంభించిన స్పర్ష్ కామన్ సెర్వీస్ సెంటర్ కు ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల లోపు వచ్చి ఉచితంగా పరిష్కరించుకోవాలని ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి. తిమ్మప్ప ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాల కోసం కార్యాలయ పనివేళల్లో 08554-241146 కు సంప్రదించగలరు.

రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888
శనివారం 5 జులై 2025

# ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయి..

## రాష్ట్ర మంత్రి టి.జి భరత్



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 4)**
తమ ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని 45వ వార్డు అశోక్ నగర్ లో ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి ఏడాది పాలనలో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థులతో మాట్లాడి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. ఏ ఏ పథకాలు అందుతున్నాయో వివరాలు అడిగారు. అనంతరం మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కింది స్థాయి నుండి పై స్థాయి నాయకుల వరకు అందరం ఇంటింటికి తిరిగి ఏడాది పాలనను ప్రజలకు వివరిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం చేసిన మంచి పనులు వివరించి ప్రజలు ఏమైనా సమస్యలు చెబితే తెలుసుకొని పరిష్కరించే దిశలో ముందుకు వెళ్తున్నాం అన్నారు. మాటిచ్చిన విధంగా అన్ని హామీలు నెరవేరుస్తున్నట్లు చెప్పారు. త్వరలో మరిన్ని పథకాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. కర్నూలు నగరంలో రోడ్డు వెడల్పు పనులు చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు ప్రధానంగా మెడికల్ కాలేజీ ఎదురుగా రోడ్డు చిన్నగా ఉన్న నేపథ్యంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఈ విషయంలో ఇప్పటికే సంబంధిత దుకాణాల యజమానులతో మాట్లాడినట్లు చెప్పారు. నెలకు రూ.300ల అద్దె చొప్పున 25 సంవత్సరాల వరకు షాపులు కేటాయించి, ఆ తర్వాత మళ్లీ వారికే కేటాయించేలా రెన్యువల్ చేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా స్థానికులు మంత్రి దృష్టికి తీసుకువచ్చిన డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు అలాగే చైతన్య నగర్ లో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్ఫార్మర్ కు ప్రహరీ గోడ ఏర్పాటు చేస్తానని టి.జి భరత్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీటీ నాయుడు, కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు ధరూర్ జేమ్స్, ముంతాజ్, సంజీవలక్ష్మి, సీనియర్ నాయకులు ఆకేపోగు ప్రభాకర్, కార్పొరేటర్లు మాణిక్యమ్మ, పరమేశ్, మాజీ కార్పొరేటర్ సుంకన్న తదితరులు పాల్గొన్నారు,

# మార్గదర్శిగా నిలిచిన ఎమ్మెల్యే కుమార్తె దగ్గుపాటి ఆశ్రిత

**దగ్గుపాటి ఫౌండేషన్ తరపున 25 కుటుంబాలను దత్తత తీసుకున్న దగ్గుపాటి ఆశ్రిత**

**సీఎం చంద్రబాబు అధ్యక్షతన స్వర్ణాంధ్ర-పీ4 ఫౌండేషన్ తొలి సమావేశం**

**పీ4 చైర్మన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ఆధ్వర్యంలో సమావేశం**

**5651 కుటుంబాలను దత్తత తీసుకునేలా ప్రణాళిక**

**విద్యాసంస్థలు, వ్యాపార వర్గాల వారు ముందుకు రావాలని ఎమ్మెల్యే దగ్గుపాటి పిలుపు**








**అనంతపురం, కల్చరల్ జులై 04 ( రిపబ్లిక్ న్యూస్ ) :**
రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పి 4 కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యేందుకు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కుమార్తె దగ్గుపాటి ఆశ్రిత ముందుకొచ్చారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన స్వర్ణాంధ్ర-పీ4 ఫౌండేషన్ తొలి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. జూమ్ ద్వారా నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పి 4 చైర్మన్ దగ్గుపాటి ప్రసాద్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, ఎమ్మార్వో హరికుమార్, ఎంపీడీవో దివాకర్, డిప్యూటీ కమిషనర్ పావనితో పాటు పీ4బృందం సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన సందేశాన్ని అంతా విన్నారు. తొలి జనరల్ బాడీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పీ-4 లోగో ఖరారు చేశారు. పంద్రాగస్టు నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చంద్రబాబు చెప్పారు. ఈ సమావేశంలోనే తాము 25 కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు దగ్గుపాటి ఫౌండేషన్ ప్రకటించింది. 25 కుటుంబాలను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు తాము కృషి చేస్తామని దగ్గుపాటి ఆశ్రిత తెలిపారు. నగర కమిషనర్ బాలస్వామితోపాటు పీ4 బృందం మొత్తం అభినందించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ పీ-4 కార్యక్రమం అన్నది దేశంలో ఎక్కడా లేదని ... పేద కుటుంబాలను ఉన్నత స్థానాలకు చేర్చే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమం పై ఎవరు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని ఆయన సూచించారు. పీ4ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రత్యేకంగా కమిటీలు వేసుకున్నట్లు చెప్పారు. ముఖ్యంగా నగరంలో 5651 కుటుంబాలను గుర్తించామని ఆ కుటుంబాలు అత్యంత నిరుపేద స్థితిలో ఉన్నాయన్నారు. ఈ కుటుంబాలకు చేయూతనిచ్చి ముందుకు నడిపించే విధంగా దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నగరంలో ఎక్కువగా విద్యాసంస్థలు, ఆసుపత్రులు, పరిశ్రమలు, హోటళ్లు ఎక్కువగా ఉన్నాయని ఇలాంటి వారు పీ4 కార్యక్రమంలో భాగస్వామ్యమై మార్గదర్శిగా నిలవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. పీ4 అంటే కేవలం ఒక కుటుంబానికి ఆర్థిక సాయం చేయడమే కాదని, ఆ కుటుంబాలకి అన్ని విధాలుగా అండగా ఉండి,వారు ఉన్నతంగా రాణించే విధంగా సహకారం అందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యం అని ఎమ్మెల్యే దగ్గుపాటి స్పష్టం చేశారు.

# మహనీయుల సేవలను స్మరించుకుందాం

**జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి శిరిశాల రాంబాబు**



**అనంతపురం,కల్చరల్, జులై 04 (రిపబ్లిక్ న్యూస్ ) :**
నగరంలోని అశోక్ నగర్ లో స్వామి వివేకానంద వర్ధంతిని రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.శుక్రవారం అశోక్ నగర్ లో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి శిరిశాల రాంబాబు పూలమాలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శిరిశాల రాంబాబు, మాట్లాడుతూ ...

**ఆయన ఆలోచనలు దార్శనికత మన సమాజానికి కాంతిగా మిగిలాయి**

జీవితంలో ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకుంటే ఏదైనా సాధించగలమని స్వామి వివేకానంద చరిత్ర చెబుతుందని శిరిశాల రాంబాబు అన్నారు. భారతీయ సంస్కృతిని, ఆధ్యాత్మిక విశిష్టతను ప్రపంచవ్యాప్తంగా చేయడంతో పాటు ... యువతను కార్య సూర్యులుగా చేసే స్ఫూర్తిదాయక బోధలను అందించినటువంటి గొప్ప మహినయుని స్మరించుకుంటూ స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా ఆయన స్మృతికి నివాళులర్పించినట్లు తెలిపారు.ఆయన ఆలోచనలు దార్శనికత మన సమాజానికి కాంతిగా మిగిలిపోయాయన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా మైనారిటీ అధ్యక్షులు సాలర్ బాషా మాజీ నగర అధ్యక్షులు క్రిష్ణ కుమార్, మాజీ కార్పొరేటర్ సీసాల శీన, జిల్లా మైనారిటీ అధ్యక్షులు రజాక్, మాజీ కో అప్షన్ మెంబెర్ మున్వర్, నగర టి.యన్.టి.యు సి అధ్యక్షులు పూల బాషా, తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ జిల్లా నాయకులు ఎన్.బి.కె నారాయణస్వామి, బోయ రాము, దలవాయి రామకృష్ణ, ఓబుల్ రెడ్డి, గోవింద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.గౌరవ నివాళులర్పిస్తూ స్వామి వివేకానంద ను స్మరించుకున్నారు.

# నిషేధిత జాబితాలో ఉన్న డాటెడ్ ల్యాండ్స్, 22ఏ సమస్యల పరిష్కారానికి చర్యలు

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్**





**అనంతపురం,కలెక్టరేట్ ,జులై 04 ( రిపబ్లిక్ న్యూస్ ) :** కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం సాయంత్రం జిల్లాస్థాయి డాటెడ్ ల్యాండ్స్ కమిటీ, డిఎల్సి, డిఎల్ఎన్సి సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిషేధిత జాబితాలో ఉన్న డాటెడ్ ల్యాండ్స్ ని, 22ఏ భూములను తొలగించేందుకు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో వస్తున్న అర్జీలకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతివారం ఒక మండలం నుంచి ఒక డాటెడ్ ల్యాండ్స్, ఒక 22ఏ కేసులకు సంబంధించి ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఈ సమావేశంలో 22ఏకు సంబంధించి 19 క్లెయిమ్స్ ని విచారించడం జరగగా, అందులో 4 ఆమోదించగా, 13 తిరస్కరించగా, 2 దరఖాస్తులను పునః పరిశీలించాలన్నారు. డాటెడ్ ల్యాండ్స్ కి సంబంధించి 1 క్లెయిమ్స్ ని విచారించడం జరగగా, ఆ కేసుని పునః పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డిఆర్ఓ ఏ.మాలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, ఆయా మండలాల తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# జుక్కల్ - బిచ్కుంద మండలలో ఉన్న ప్రైవెట్ పాఠశాలల్ల యాజమాన్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలి...

**(A.I.S.B) జిల్లా అధ్యక్షులు బైరాపూర్ రవీందర్ గౌడ్ & (T.N.S.F) రాష్ట్ర నాయకులు పుట్ట భాస్కర్ డిమాండ్...**





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి , జుక్కల్ జులై05రిపబ్లిక్ న్యూస్:** జుక్కల్ నియోజకవర్గం లోనిజుక్కల్,బిచ్కుంద మండలాల్లో అన్ని ప్రైవేటు పాఠశాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని, తల్లి,తండ్రులు తమ పిల్లలకూ ఉన్నత చదువులు చదివించాలనే తపనతో గుణత్మక విద్యా అందించాలని ఆరాటపడే వీరి అమాయకత్మని కొన్ని ప్రైవెట్ స్కూల్ యాజమాన్యలు మాత్రం సొమ్ము చేసుకుంటునారని,మా పాఠశాలల్లో మంచి విద్యను అందిస్తామని ప్రగల్బాలు పలికి విద్యార్థులను ఈ పాఠశాలల్లో చేర్చుకొని బారిగా అధిక పీజులు వాసులు చేస్తున్నారని ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ జిల్లా అధ్యక్షులు బైరాపూర్ రవీందర్ గౌడ్ తెలుగు నాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు పుట్ట భాస్కర్ అన్నారు ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా జిల్లా విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వాలనే విద్యార్థులకూ వారి తల్లి,తండ్రులకూ శాపంగా మారుతోందని,ఈ నిర్వాకనీ చూసి చూడనట్లుగా వ్యవహారిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు వ్యవహారిస్తునరాన్ని దీంతో కొన్ని ప్రైవెట్ పాఠశాలల యాజమాన్యలు రెచ్చిపోతు కనీస నిబంధనలు కూడా పాటించకుండా ఇష్టనూ సారంగా వ్యవహారిస్తునరాని వారు అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం,విద్యాశాఖ అధికారులు ప్రైవెట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు,నోట్ బుక్స్,యూనిఫామ్స్ అమ్మారాదని జీవో జారిచేసిన కొన్ని ప్రైవెట్ స్కూల్ యాజమాన్యలు మాత్రం పాటించకుండా అధికాధరలకు విక్రాయిస్తున్నారని ఆయన ఆయన అన్నారు.కావున వెంటనే జిల్లా ఉన్నత అధికారులు మరియు జిల్లా విద్యాశాఖ అధికారులు దోమకొండ లో ఉన్న ప్రైవెట్ పాఠశాలల యాజమాన్యలపై వెంటనే పై తాగు చర్యలు వెంటనే తీసుకోవాలని వారు జిల్లా మండల విద్యాశాఖ అధికారులనూ కోరారు.లేని యెడల మా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా (కలెక్టర్) ఆఫీస్ నూ మరియు జిల్లా ఆఫీస్ లను ముట్టడించగలమని వారు తెలిపారు...

# బీఆర్ఎస్ పార్టీ లో చేరిన జహీరాబాద్ నాయకులు




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై05రిపబ్లిక్ న్యూస్**
జహీరాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు సమక్షంలో మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి ఆధ్వర్యంలో విట్టునాయక్ తాండాకి చెందిన మాజీ వార్డ్ మెంబర్లు శక్రు, రాజు, లక్ష్మణ్ సీనియర్ నాయకులు ప్రకాష్, తారా సింగ్ రాథోడ్, గోపాల్ తదితరులు శుక్రవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్ రావు వారికి గులాబి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

**గిరిజన ప్రాంతంలోని మండల ప్రజా పరిషత్ స్కూల్ నందు విద్యార్థులకు అందించే**

# మధ్యాహ్న భోజన పథకాన్ని స్వయంగా తిని నాణ్యతను పరిశీలించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.







**నంద్యాల.. జులై..05 (రిపబ్లిక్ న్యూస్)**
నంద్యాల నియోజకవర్గంలో అబండాం తాండ సుగాలి మెట్ట వద్ద గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను రాష్ట్ర మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గారు సందర్శించి విద్యార్థులను ఆత్మీయంగా పలకరించి కాసేపు ముచ్చటించారు.ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ వారందరితో మాట్లాడుతూ వారికి ప్రభుత్వం తరపున అందిస్తున్న తల్లికి వందనం పథకం నిధులు తమ తల్లుల ఖాతాలో జమ అయ్యాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు.మరియు ప్రభుత్వం అందించిన స్కూల్ బ్యాగులు పుస్తకాలు డ్రెస్సుల నాణ్యతను పరిశీలించారు. అదే విధంగా వారి చదవు ఎలా సాగుతుందని టీచర్లతో అడిగి తెలుసుకొని విద్యార్థులకు చదువు యొక్క ప్రాముఖ్యతను తెలియజేసి పిల్లలందరూ చక్కగా చదువుకోవాలని ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ వారికి పిలుపునిచ్చారు. ఈ ప్రాంతంలో అత్యధికంగా పేద గిరిజన విద్యార్థులు చదుకునే ఈ స్కూల్ నందు మధ్యాహ్న పథకం క్రింద పిల్లలకు అందించే ఆహారాన్ని స్వయంగా పరిశీలించారు. అన్నం పప్పుతో పాటు అందించాల్సిన గుడ్డు మరియు చిక్కి అందించకపోవడంతో విద్యాశాఖ అధికారులకు వెంటనే సంబంధిత కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకుని పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని తప్పక అందించాలని ఆదేశాలు జారిచేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి , అబా%శీ%డం తాండ టిడిపి అధ్యక్షులు , నంద్యాల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ , టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుమావత్ స్వామి నాయక్ , ఎమ్మార్వో , ఎంపీడీవో , ప్రభుత్వ అధికారులు , నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హరిబాబు , కొట్టాల శివ నాగిరెడ్డి , నంద్యాల మండలం కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి , కేసీ కెనాల్ చైర్మన్ చాబోలు ఇలియాజ్ , ప్రేమ్ నాథ్ రెడ్డి , సర్పంచ్ నారాయణ , రాజేష్ , గోవింద నాయుడు , మండ్ల గుర్రప్ప , కట్టెల డిపో గఫార్ , రమేష్ నాయక్ , విజయ్ నాయక్ , కార్తీక్ నాయక్ , గ్రామ పెద్దలు , మహిళలు , సచివాలయ సిబ్బంది మరియు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# రైతులకు ఉచితంగా కోడెదూడలు ఇవ్వడం అభినందనీయం.







## ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి..

**నంద్యాల.. జులై..04 (రిపబ్లిక్ న్యూస్)**
దేశానికి అన్నం పెట్టే రైతులకు ఉచితంగా కోడెదూడలు ఇవ్వడం అభినందనీయమని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం బిజినవేముల గ్రామంలో శుక్రవారం శ్రీ కృష్ణ గోశాల సొసైటీ అధ్యక్షులు శ్రీనివాసులు 12 ఎద్దులు ( కోడెలను) నిరుపేద రైతులకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చేతుల మీదుగా పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రైతులకు వెన్నుదన్నుగా ఉండాలన్నారు. శ్రీ కృష్ణ గోశాల సొసైటీ వారు విలువైన కోడెదూడలు దానం చేయడం మంచి నిర్ణయం అన్నారు. గోశాలలో ఆవులకు పూజలు చేసి రైతులతో సమావేశమైయ్యారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, రాష్ట్ర సివిల్ డైరెక్టర్ మహేష్ నాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి కాకరవాడ చిన్న వెంకటస్వామి, పోతుల రఘురాం రెడ్డి, మురళి రెడ్డి, రమేష్, శివ,ముగ్గ సుధాకర్, మౌలాలి, కుర్వ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి, పింగళి వెంకయ్య, స్వామి వివేకానందకు
# మాజీ మంత్రి దేవినేని ఉమా ఘన నివాళి

**ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి ప్రతినిధి, జులై 4 (రిపబ్లిక్ న్యూస్)**
గొల్లపూడి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో స్వామి వివేకానంద, పింగళి వెంకయ్య వర్ధంతి, అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన వారి సేవలను, త్యాగాలను స్మరించుకున్నారు. ఈ క్రమంలో దేవినేని ఉమా మాట్లాడుతూ, "స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తి ప్రదాత. ఆయన బోధనలు ఈ రోజున కూడా మనలో ఆత్మవిశ్వాసాన్ని, సామాజిక స్పృహను రేకెత్తిస్తాయి. ఆయన చెప్పినట్లు 'ఉత్తిష్ఠత జాగ్రత ' లేవండి, మేల్కొనండి, లక్ష్యాన్ని చేరుకునే వరకు ఆగకండి ఈ సందేశం యువతకు దిశానిర్దేశం చేస్తుంది," అని అన్నారు.
పింగళి వెంకయ్య గురించి మాట్లాడుతూ, ఆయన జాతీయ



జెండా రూపకర్తగా చేసిన కృషిని కొనియాడారు. "పింగళి వెంకయ్య మన జాతీయ పతాకాన్ని రూపొందించి, భారతీయుల స్వాతంత్ర్య ఆకాంక్షలకు చిహ్నంగా నిలిచారు. ఆయన త్యాగం, దేశభక్తి మనందరికీ స్ఫూర్తిదాయకం," అని ఉమా పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన స్వాతంత్ర్య సమరంలో చేసిన పోరాటాన్ని గుర్తు చేశారు. "అల్లూరి సీతారామరాజు గిరిజనుల హక్కుల కోసం, బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అసమాన సాహసంతో పోరాడారు. ఆయన ధైర్యం, నిస్వార్థ సేవ ఈ తరం యువతకు ఆదర్శంగా నిలుస్తుంది," అని ఆయన ఉద్వేగంతో వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. దేవినేని ఉమామహేశ్వరరావు ఈ మహనీయుల ఆదర్శాలను ఆచరణలో పెట్టి, సమాజ సేవ, దేశాభివృద్ధి కోసం కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. "మనం వీరి బాటలో నడిచి, సమాజంలో సానుకూల మార్పు తీసుకురావాలి. తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తుంది," అని ఆయన పేర్కొన్నారు.

## అల్లూరి సీతారామరాజు, వంగవీటి మోహన్ రంగా లకు ఘనంగా జయంతి వేడుక

**ఎన్టీఆర్ జిల్లా మైలవరం ప్రతినిధి, జులై 4 (రిపబ్లిక్ న్యూస్)**




మైలవరం శాసనసభ్యులు వసంత వెంకటకృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు స్వతంత్ర సమరయోధులు భరతమాత ముద్దుబిడ్డ భారత దేశ ప్రజల స్వాతంత్రం కోసం భారతదేశ బానిస సంకెళ్లు విడడం కోసం దేశం కోసం బ్రిటిష్ వారి ముందు తనరొమ్ము చూపింపించి బ్రిటిష్ వారి తూటాలకు ప్రాణాలు అర్పించిన అల్లూరి సీతారామరాజు జయంతి పేదల కోసం పోరాడి తన ప్రాణాలను సైతం అర్పించిన వంగవీటి మోహన్ రంగా జయంతిని పురస్కరించుకొని మైలవరం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో వారి జయంతిని ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మైలవరం పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగినది.

## కీ. శే.కొణిజేటి రోశయ్యకి నివాళులర్పించిన సామినేని ఉదయభాను.






**ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట ప్రతినిధి, జులై 4 (రిపబ్లిక్ న్యూస్)** జగ్గయ్యపేట పట్టణం, జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రివర్యులు, తమిళనాడు, కర్ణాటక మాజీ గవర్నర్ కీ. శే.కొణిజేటి రోశయ్య 92 వ జయంతి సందర్భంగా రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను. ఈ సందర్భంగా సామినేని ఉదయభాను మాట్లాడుతూ, కొణిజేటి రోశయ్య నిబద్ధతకు, నిజాయితీకి మారుపేరు అని కొనియాడారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో అనేక పదవులు చేపట్టి, రాష్ట్ర అభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట ప్రతినిధి, జులై 4 (రిపబ్లిక్ న్యూస్)**
కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను పురస్కరించుకొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు జగ్గయ్యపేట పట్టణంలో 22 వ వార్డు మిట్టగూడెంలో కేడీసీసీ బ్యాంకు చైర్మన్ %ు% ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురామ్, శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), "సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. కూటమి ప్రభుత్వ ఏడాది పరిపాలన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకుని ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజలు కొన్ని సమస్యలను



ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గింజుపల్లి రమేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల కుమార్ రాజా, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మేక



వెంకటేశ్వర్లు, పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకృష్ణ, కౌన్సిలర్ గొట్టే నాగరాజు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సయ్యద్ అన్వర్, జిల్లా మైనార్టీ కార్యదర్శి షేక్ మదార్, క్లస్టర్ షేక్ ఖాసిం నాయకులు ముల్లపూడి అప్పారావు, షేక్ అక్బర్, దువ్వల రామకృష్ణ, కావేటి కృష్ణ, వేట వెంకయ్య, కారం శ్రీను, ప్రసాదపు పెద్ద మురళి, మార్తి అచ్చయ్య, పునుగుపాటి అయ్యప్ప, కావేటి కోటి, చొప్పవరపు సైదులు, తరమని వీరాచారి, బొక్కల గోపి బాబు, పసుపునూరి పెద్ద శివ, ప్రసాదపు హరి తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ రాజకీయ రంగంలో ముఖ్యమైన వ్యక్తి వంగవీటి మోహన రంగా





**ఎన్టీఆర్ జిల్లా నందిగామ ప్రతినిధి, జులై 4 (రిపబ్లిక్ న్యూస్)**
నందిగామ పట్టణం కాకాని నగర్ నందు ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కార్యాలయంలో శుక్రవారం వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన కూటమి నేతలు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంగా సామాజిక న్యాయంపై దృష్టి సారించారు, భూమిలేని వారికి భూ పంపిణీ అణగారిన వర్గాల సంక్షేమం కోసం వాదించారు. పోలీసుల క్రూరత్వానికి వ్యతిరేకంగా కూడా ప్రచారం చేశారు, తనను తాను అణగారిన వర్గాలకు మద్దతుదారుగా మారారని తెలియజేస్తూ ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

## ఆత్మీయతతో ప్రజలకు సేవ చేసిన మహానేత స్వర్గీయ వంగవీటి మోహన రంగా

**ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట ప్రతినిధి, జులై 4 (రిపబ్లిక్ న్యూస్)**
స్వర్గీయ వంగవీటి మోహన రంగా 78వ జయంతి సందర్భం గా జగ్గయ్యపేట పట్టణంలో తెలుగుదేశం పార్టీ కాపు నాయకులు ఏర్పాటు చేసిన జయంతి ఉత్సవాలలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు శ్రీరాం ధనుంజయ్ (చిన్నబాబు) వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూవంగవీటి మోహనరంగా ఆత్మీయతతో ప్రజలకు సేవ చేసిన మహానేత. సామాజిక న్యాయం కోసం ఆయన పోరాటం స్ఫూర్తిదాయకం. అన్యాయాన్ని తట్టుకోలేని ఆత్మవిశ్వాసం, పేదల కోసం పాటుపడిన జీవితమంతా యువతకు మార్గదర్శకంగా



నిలుస్తుంది. రంగా ఆశయాల ను, సిద్ధాంతాలను కొనసాగించ డం మనందరి బాధ్యత. ఆయన చూపిన మార్గంలో వంగవీటి రాధా బాబు ప్రజాసేవను కొనసాగిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కాపు నాయకులు తెలుగుదేశం పార్టీ నాయకులు, కౌన్సిలర్స్, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గవర్నర్ నజీర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్న దర్శి నర్మద

**ఎన్టీఆర్ జిల్లా నందిగామ ప్రతినిధి, జులై 4 (రిపబ్లిక్ న్యూస్)**
నందిగామ మండలం ఐతవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ ప్రముఖ నాయకులు దర్శి నాగమల్లేశ్వరరావు (చంటి) కుమార్తె దర్శి నర్మదా శుక్రవారం నాడు కాకినాడ జేఎన్టీయూలో గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొని జేఎన్టీయూ బీఫార్మసీ టాపర్, గోల్డ్మెడలిస్ట్ అయిన దర్శి నర్మదాకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు చంటి నర్మదాకు అభినందనలు తెలిపారు.




# ఎన్.టి.ఆర్.జిల్లా హమాలీ (ముఠా) వర్కర్స్ యూనియన్ (సిఐటియు)జిల్లా 4వ మహాసభ

### హమాలీ/ ముఠా కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయండి.

**ఎన్టీఆర్ జిల్లా నందిగామ ప్రతినిధి, జులై 4 (రిపబ్లిక్ న్యూస్)**
నందిగామ రైతు బజారు ముఠా వర్కర్స్ యూనియన్ రైతు బజార్ దగ్గర కరపత్రాలు విడుదల చేయడం జరిగింది.
ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కె.గోపాల్ మాట్లాడుతూ. ముఠా కార్మికుల హక్కులు, సంక్షేమం సంక్షేమ నిరంతరం పోరాడుతున్న ఎన్టిఆర్ జిల్లా హమాలీ (ములా) వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా 4వ మహాసభ జూలై 15 మంగళవారం ఉదయం 10 గంటల నుండి తిరువూరు పట్టణంలో జరగనున్నది. ఈ మహాసభలో అన్ని రకాల ముఠా కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేయుచున్నాము. ఎగుమతులు, దిగుమతుల్లో ముఠా కార్మికులు కీలకపాత్ర పోషిస్తున్నారు. గ్రామీణ కాటా, షాపులు, రైతు బజార్లు, ఆల్మాల్స్, పౌరసరఫరాల సంస్థ (సివిల్ సప్లై), సెంట్రల్ వేర్ హౌస్ (సిడబ్ల్యుసి), స్టేట్ వేర్ హౌస్ (ఎస్డబ్ల్యుసి), వ్యవసాయ మార్కెట్ యార్డు (ఎఎంసి) తదితర గోడౌన్లలో వివిధ రకాల ముఠా కార్మికులు జిల్లాలో వేలాది మంది పనిచేస్తున్నారు. అపరిమితమైన పనిగంటలు, అధిక బరువులు మోయడంతో కీళ్ళ కండరాల జబ్బులతో అనారోగ్యం పాలవుతున్నారు. తక్కువ వయస్సులోనే వృద్ధాప్య లక్షణాలు వచ్చేస్తున్నాయి.




ప్రమాదాల బారిన పడి చనిపోతున్నా / గాయపడినా యాజమాన్యాలు గానీ, ప్రభుత్వాలు గానీ పట్టించుకోవడం లేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ళు గడిచినా ముఠా కార్మికులకు ఏ చట్టాలు అమలు చెయ్యకుండా పాలకులు దగా చేస్తున్నారు. కార్మికవర్గం పోరాట ఫలితంగా మన రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ ముఠా, జట్టు, హమాలీ కార్మికుల సంక్షేమ చట్టం 1976 లోనే చేశారు. 2008లో వామపక్ష పార్టీల మద్దతుతో నడిచిన కేంద్రంలోని యుపిఏ ప్రభుత్వం అసంఘటిత కార్మికుల సాంఘిక భద్రతా చట్టాన్ని చేసింది. కానీ వీటి ద్వారా ఏవిధమైన ప్రయోజనా లు కల్పించలేదు. చట్టం అమలు కోసం అవసరమైన నిధులను కేటాయించలేదు. 2024 ఎన్నికల సందర్భంగా ముఠా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని తెలుగుదేశం కూటమి మానిఫెస్టోలో చెప్పింది. అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా హామీ అమలుకు నోచుకోలేదు. సంక్షేమబోర్డు ఊసేలేదు. ముఠా ఆటోలు, ట్రాలీలపై విపరీతమైన చలానాలు, పోలీసు కేసులు పెట్టి వేధిస్తున్నారు. పనిగంటలు అమలుకావు. హమాలీల శ్రమ ఫలితంగా సంస్థలకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కోట్లాది రూపాయలు ఆదాయం సమకూరుతున్నా వీరి సంక్షేమానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టడం లేదు. ముఠా కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం యూనియన్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాడుతున్నది. ఈ నేపథ్యం లో 2025 జూలై 15న తిరువూరు పట్టణంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే ఎన్టిఆర్ జిల్లా హమాలీ (ముఠా) వర్కర్స్ యూనియన్ 4వ జిల్లా మహాసభలో ముఠా కార్మికులకు సంక్షేమబోర్డు సాధన, హక్కుల పరిరక్షణ కోసం కార్యాచరణ రూపొందించ డం జరుగుతుంది. కావున ఈ మహాసభలలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు షేక్ రఫీ, మరియన్న, దేవరాజు, శివకృష్ణ, ముక్కంటి, బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మల్టీప్లెక్స్ థియేటర్ల స్వర్ణోత్సవం

**గౌరి, గంగ, గాయత్రి, గౌతమి థియేటర్లకు 50 ఏళ్లు -కుటుంబసభ్యుల సమక్షంలో అంబరాన్నంటిన సంబరాలు**







**అనంతపురం,జులై 04 ( రిపబ్లిక్ న్యూస్ ):**
ఇప్పటి రోజుల్లో ఒక్క సింగిల్ స్క్రీన్ థియేటర్ నడిపించడమే చాలా కష్టమవుతోంది. అయితే అన్నీ మల్టీప్లెక్సులకు ఇచ్చేయడం, లేదా కొన్నింటిని కళ్యాణమండపాలగా మార్చేయడం తప్పనిసరిగా మారుతోంది. అలాంటి తరుణంలో కూడా ఎన్ని కష్టాలు ఎదురైనా తట్టుకుని, సినీ కళామతల్లికి సేవచేయడమే లక్ష్యంగా నగరంలోని గౌరి, గంగ, గాయత్రి, గౌతమి థియేటర్లు ఇప్పటికి 50 ఏళ్ల పూర్తిచేసుకున్నాయి. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల సమక్షంలో థియేటర్ల ఆవరణలో కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. ఈ నాలుగు థియేటర్లను స్థాపించి ఇప్పటికి అర్ధ శతాబ్దం గడిచింది. నాటి నుంచి నేటి వరకు పట్టణవాసుల ఆదరాభిమానాలతో ఈ థియేటర్లన్నీ విజయవంతంగా నడుస్తున్నాయని వీటి వ్యవస్థాపకులు ఎస్. వెంకట నారాయణ రెడ్డి, ఎస్. ఒన్నూరు రెడ్డి, ఎస్. చిన్న వెంకటరెడ్డి, ఎస్. సీతారామిరెడ్డి, ఎస్. రామచంద్రారెడ్డి, ఎస్. రామకృష్ణారెడ్డి తెలిపారు. ముందుగా తమ తండ్రి సానె పెద్ద వీరారెడ్డి 1971లో ఈ భూమిని కొనడంతోపాటు, గౌరి సినీ కాంప్లెక్స్ నిర్మాణానికి కూడా ఆర్థికంగా సహకరించారని సోదరులు ఆరుగురు తెలిపారు. తమ థియటేర్లు 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా వారు మాట్లాడుతూ ...

**వినోద రంగంలో సరికొత్త ప్రమాణాలను స్థాపించాం**

1975 జులై 4వ తేదీన 980 సీట్ల సామర్థ్యం, 70 ఎంఎం స్క్రీన్, విభిన్నమైన ర్యాంప్ నిర్మాణంతో గౌరీ థియేటర్ ప్రారంభమైందన్నారు. 590 సీట్ల సామర్థ్యంతో ఉన్న గంగా థియేటర్‌ను 1981 జులై 16న , 700 సీట్ల సామర్థ్యం ఉన్న గాయత్రి థియేటర్‌ను 1987 డిసెంబర్ 25న, 313 సీట్ల సామర్థ్యం ఉన్న గౌతమి థియేటర్‌ను 1997 మే 2న ప్రారంభించామన్నారు ఇప్పుడు ఈ నాలుగు థియేటర్లు కేవలం అనంతపురం పట్టణంలోనే కాక రాయలసీమ వాసులందరికీ సుపరిచితమేనన్నారు. ఇవి వినోద రంగంలో సరికొత్త ప్రమాణాలను స్థాపించాయి. ఎప్పటికప్పుడు చిత్ర ప్రదర్శన రంగంలో వస్తున్న ఆధునిక మార్పులన్నింటికీ ఈ థియేటర్లలో స్థానం కల్పించానన్నారు. దాంతో ఇది సినీ వీక్షణ అనుభవాన్ని ఎప్పటికప్పుడు మారుస్తూ ఉంది. ఎత్తులో ఉండి చూసేందుకు వీలుగా బాల్కనీ సీటింగ్, తర్వాత పెద్ద సినిమాలు సుఖంగా చూసేందుకు పుష్ బ్యాక్ సీట్లు, డీటీఎస్ డాల్బీ సౌండ్ సిస్టమ్‌తో అత్యాధునిక శబ్ద నాణ్యత అందించామని తెలియజేశారు. ఎండలతో ప్రేక్షకులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఎయిర్ కూలింగ్




సిస్టంలను కూడా ప్రవేశపెట్టానన్నారు. ఇక ఇక్కడి క్యాంటీన్లలో సినిమా అనుభవాన్ని ఏమాత్రం మిస్ కాకుండానే మంచి తాజా ఆహార పదార్థాలు అందుబాటు ధరల్లో పెట్టాం. ఇప్పటి వరకు ఈ థియేటర్లలో దాదాపు 250 సినిమాలు వంద రోజుల చొప్పున ఆడాయని ఇలా రాయలసీమ వాసులందరికీ వినోదాన్ని పంచుతూ ఎప్పటికప్పుడు సరికొత్త సినీ వీక్షణ అనుభవాన్ని వారికి అందిస్తూ వారి ఆదరాభిమానాలతో మరో 50 ఏళ్లు కూడా ఇలాగే గడవాలని కోరుకుంటున్నామని సోదరులు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మల్టీప్లెక్స్ థియేటర్ల స్వర్ణోత్సవ సంబరాలను నిర్వహించామని తెలిపారు.

# మాజీ ముఖ్యమంత్రి జగన్ ఈ నెల 9 న,చిత్తూరు జిల్లా రాక





**బంగారుపాళ్యం (రిపబ్లిక్ న్యూస్) జూలై 4**
మామిడి రైతులకు అండగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారు ఈనెల 9నలిచిత్తూరు జిల్లా లోని పూతలపట్టు నియోజకవర్గంలోని బంగారుపాళ్యంలో పర్యటిస్తున్న నేపథ్యంలో స్థల పరిశీలన నిర్వహించిన తదుపరి రీజినల్ కో ఆర్డినేటర్ మాజీ మంత్రి శ్రీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గారు మరియు ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు భువన కరుణాకర్ రెడ్డి గారు నేడు చిత్తూర్ జిల్లా వైయస్సార్ సిపి ముఖ్య నేతలతో జగనన్న పర్యటన విజయవంతం చేసే నేపథ్యంలో సమావేశం నిర్మించడం జరిగినది కూటమి ఏడాది పాలన సందర్భముగా అబద్ధాల పండగ చేసుకుంటున్న సీఎం చంద్రబాబుకు చిత్తూరు జిల్లా మామిడి రైతులు కష్టాలు కనిపించడం లేదా మార్కెట్లో కేజీ రూ 2 లకు కూడా ఎవరు కొనుగోలు చేసే పరిస్థితి లేదు దీనిని పెద్దరెడ్డి రామచంద్రారెడ్డి గారు కారణం అంటున్న చంద్రబాబు తనకు నిత్యం భజన చేసే ఈనాడు టీవీ 5 ధర విష ప్రచారం చేస్తున్నారు మంత్రంగా జిల్లా కలెక్టర్ తో సమావేశం నిర్మించి ఫ్యాక్టరీలకు కేజీ రూ 8 కి కొనుగోలుకు చేయాలని చెప్పి వెళ్ళిపోయారు కానీ ఫ్యాక్టరీలకు ఒత్తిడి చేసి పంటను కొనుగోలు చేయించడం లేదు ఈ దారుణమైన పరిస్థితిలో రైతులకు స్వచ్ఛందంగా మామిడి తోటలను నరికేస్తున్నారు గిట్టుబాటు ధర కల్పించలేని దద్దమ్మ ప్రభుత్వం చంద్రబాబుది దీంతో స్వయంగా మామిడి రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకునేందుకు వైయస్ జగన్ బంగారుపాళ్యంలో మార్కెట్లోకి రానున్నారని రైతుల పక్షాన పోరాడేందుకు వైఎస్ఆర్సిపి సిద్ధం మనీ వెంకటేష్ గౌడ్ గారు తెలిపారు ఈ కార్యక్రమంలో పలమనేరు ఎమ్మెల్యే వెంటే గౌడ గారు మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి గారు మాజీ మంత్రి ఆర్కే రోజా గారు మాజీ ఎంపీ రెడ్డప్ప గారు ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం గారు తిరుపతి చిత్తూరు జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి గారు భూమన అభినయరెడ్డి గారు శ్రీకాళహస్తి బియ్యపు మధుసూదన్ రెడ్డి గారు గంగాధర్ నెల్లూరు కృప లక్ష్మీ గారు ఎమ్మెల్సీ కుప్పం ఇన్చార్జి భరత్ గారు సత్తివేడు రాజేష్ గారు జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు గారు వైఎస్ఆర్సిపి నాయకులు భారీ సంఖ్యలో పాల్గొనడం జరిగినది

## పేద ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన అసమాన ప్రజానాయకుడు వంగవీటి రంగా




**ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట ప్రతినిధి, జులై 4 (రిపబ్లిక్ న్యూస్)** జగ్గయ్యపేట పట్టణం, స్థానిక కోదాడ రోడ్డు నందు బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి స్వర్గీయ వంగవీటి మోహన్ రంగ 78వ జయంతి సందర్భం గా జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను వంగవీటి మోహన రంగ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సామినేని ఉదయభాను బడుగు బలహీన వర్గాల శ్రేయస్సు కోసం వంగవీటి మోహన రంగ నిరంతరం పరితపించేవారని ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం అట్టడుగు వారికి కూడా అందాలని కోరుకునేవారని ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని నేటి యువత పనిచేయాలని అన్నారు. వంగవీటి మోహన రంగా అనే వ్యక్తి ఒక కులానికో, ఒక ప్రాంతానికో చెందిన వ్యక్తి కాదని ఆయన ఒక శక్తి అని అన్నారు. పేదలకు అండగా నిలిచేతత్వమే ఆయనకు ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించిపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ దేవరాయ కాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, రంగా అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెద్ద భజన వాడ పంచాయతీ టిడిపి పార్టీ ప్రెసిడెంట్ గా ఏ రవి ఏకగ్రీవం

**కుప్పం (రిపబ్లిక్ న్యూస్) జూలై 4**



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ విప్ కడ అడ్వైజర్ కమిటీ చైర్మన్ MLC డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మరియు కుప్పం నియోజకవర్గ ఇన్చార్జ్ APSRTC వైస్ చైర్మన్ మునిరత్నం సహకారంతో . పెద్దభజనవాడ పంచాయతీ టిడిపి పార్టీ ప్రెసిడెంట్ గా రవి ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఆయన మాట్లాడుతూ నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ నా కట్టెకాలింతవరకు పార్టీకి కృషి చేస్తానని నా మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని పంచాయతీకి ఎప్పుడు ఎల్లవేళలా తోడుంటానని పార్టీని ఏకతాటిపై తీసుకొస్తానని అందర్నీ కలుపుకుంటూ ఐకమత్యం తో ఉంటానని ఆయన సంతోషంతో కొనియాడారు. ఈ విషయం తెలుసుకున్న పంచాయతీ నాయకులు కార్యకర్తలు రవి కి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు

## ఐదు పిల్లలకు జన్మనిచ్చిన మేక

### ధర్మారం మండలంలో వింత సంఘటన -చూడా ముచ్చటగా ఉందంటున్న గ్రామస్తులు




**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి**
**ధర్మారం జులై 4 (రిపబ్లిక్ న్యూస్)**
సాధారణంగా మేక రెండు, లేదా మూడు పిల్లలకు జన్మనిస్తుంది. కానీ ఇదేం చిత్రం గురూ! ఈ మేక ఒక కాన్పులో ఐదు పిల్లలకు జన్మనివ్వడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఒకే కాన్పులో ఐదు మేక పిల్లలు జన్మించిన ఘటన పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నర్సింగాపూర్ లో వెలుగుచూసింది. గ్రామానికి చెందిన మేకల కాపరి పంబాల సురేష్ –అర్చన దంపతుల చెందిన మేక . ఒకే కాన్పులో ఐదు పిల్లలకు జన్మనిచ్చింది. ఇందులో మూడు ఆడవి కాగా, రెండు మగ పిల్లలు పిల్లలన్నీ ఆరోగ్యంగా ఉండి చెంగుచెంగున దూకుతుంటే.. చూడముచ్చటగా ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇలాంటి సంఘటనలు అరుదుగా జరుగుతాయి ఎందుకంటే ఇది సహజంగా జరిగే విషయం కాదు ప్రజలకు ఆసక్తి కనబరిచే విషయం

## మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై05రిపబ్లిక్ న్యూస్** నారాయణఖేడ్ నియోజకవర్గం నాగల్ గిద్ద మండలం కరస్ గుత్తి మాజీ సర్పంచ్ అశోక్ రావు పాటిల్ గారి సతీమణి అనారోగ్యంతో ఆసుపత్రులు చికిత్స పొంది ఇంటికి వచ్చిన విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్న నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి లి వారితోపాటు మండల పార్టీ అధ్యక్షులు పండరి నాయకులు సంజీవ్ కుమార్, సంగప్ప, తదితరులు ఉన్నారు.

## నేరాల నివారణే లక్ష్యంగా పోలీస్ లు విధులు నిర్వహించాలి

### - జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, జులై 04( రిపబ్లిక్ న్యూస్)**



నేరాల నివారణ నే లక్ష్యం గా పోలీసులు విధులు నిర్వహించాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం వార్షిక తనిఖీ లో భాగంగా జిల్లాలోని ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా ఎస్పి పోలీస్ స్టేషన్ పరిసరాలను, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించి కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో వున్న కేసులకు క్షుణ్ణంగా తనిఖీ చేసి పోలీసులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం సిబ్బందిని శాఖపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా బరోసా కల్పించాలని సూచించారు. నేరాల నివారనే లక్ష్యంగా పని చేయాలని పేర్కొన్నారు. విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి వహించి, స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరుచూ సందర్శించాలన్నారు. త్వరలో స్థానిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని, పకడ్బందిగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి రాములు ,మెట్ పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ ,ఇబ్రహీంపట్నం ఎస్.ఐ అనిల్, ఎస్.ఐ లు శ్రీకాంత్, రాజు, నవీన్ రాజు నాయక్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ సీఎం కొణిజేటి రోశయ్య జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య.



**ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట ప్రతినిధి, జులై 4 (రిపబ్లిక్ న్యూస్)**



మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలో బస్టాండ్ ఎదురుగా ఏర్పాటు చేసిన జయంతి కార్యక్రమంలో శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), శ్రీరాం చిన్నబాబు పాల్గొని రోశయ్య విగ్రహానికి పూలమాల లు వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూకొణిజేటి రోశయ్య రాజకీయాల్లో నైతికతకు నిలువెత్తు ఉదాహరణ. ఆయన పరిపాలన లో సరళత, ఆర్థిక పరిపూర్ణత, ప్రజాపాలనలో వినయశీలత ఎంతో ప్రశంసనీయమైనవి. ఆయన విధానాలు, ప్రజల పట్ల చూపిన అనురాగం ప్రతి ప్రజాప్రతినిధికి ప్రేరణలాయక మైనవి. మనం కూడా ఆయన సాధనలను, విలువలను అనుసరించి ప్రజాసేవలో నిబద్ధత కనబరచాలి"అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

## అంగన్వాడి భవనానికి తాత్కాలిక మరమ్మతుకు కృషి చేసిన రావు అక్షయ్.



**కాకినాడ జిల్లా ప్రతినిధి జులై 4, (రిపబ్లిక్ న్యూస్)**
యు కొత్తపల్లి మేజర్ న్యూస్:కుతుకుడుమిల్లి గ్రామం నిధానంథొడ్డి లో ఉన్న అంగన్వాడి పాఠశాల భవనం వర్షాలకు లీక్ అవుతుందని ఆ గ్రామస్తులు జీజస్ హాస్పిటల్ డైరెక్టర్, జనసేన నాయకులు రావు అక్షయ్ దృష్టికి తీసుకువెళగా ఆయన క్షణాల్లో స్పందించి . తాత్కాలిక ఏర్పాటుకు అవసరమైన సామగ్రినీ గురువారం ఆ గ్రామస్తులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమం ఆయన వెంట జనసేన నాయకులు కాకి బాబి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మన్యం వీరునికి ఘన నివాళులు..

### -జిల్లాలో ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు..

**కాకినాడ జిల్లా ప్రతినిధిజులై 4,( రిపబ్లిక్ న్యూస్)**




స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు చూపిన ధైర్య సాహసాలు వెలకట్టలేనివి, ఆయన అందించిన స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం నిలుస్తుందుందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమం, సీతారామరాజు స్మారక కళా వేదిక ఆధ్వర్యంలో కాకినాడ నాగమల్లితోట జంక్షన్ వద్ద గల అల్లూరి సీతారామరాజు విగ్రహానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం ఇతర జిల్లా అధికారులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ గిరిజన ప్రాంత ప్రజలలో స్వాతంత్ర కాంక్షను రగిలించడంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు కీలక పాత్ర పోషించారన్నారు. భారతదేశంలో బ్రిటీష్ వారు చేస్తున్న దోపిడిపై గిరిజన ప్రజల్లో చైతన్యం రగిలించడంలో విశేష కృషి చేసిన సమరయోధుడు అల్లూరి సీతారామరాజు అని ఆయన కొనియాడారు. గిరిజన ప్రజలు మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరికి ఆయన ధైర్య సాహసాలు స్ఫూర్తిగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎంపీ సానా సతీష్ బాబు మాట్లాడుతూ.. అల్లూరి సీతారామరాజు స్వతంత్ర పోరాటంలో గిరిజనులపై బ్రిటీషర్లు చేస్తున్న దౌర్జన్యాలపై పెద్ద ఎత్తున తిరుగుబాటు చేశారన్నారు. తన పోరాటపటిమతో తెల్లవారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించారని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో అల్లూరి సీతారామరాజు స్మృతి వనం ఏర్పాటుకు తన వంతు కృషి చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఎంపీసానా సతీష్ బాబు తెలిపారు. కార్యక్రమంలో డీటీడబ్ల్యూవో ఎస్.నాగమల్లేశ్వర రావు, సెట్రాజ్ సీఈవో మల్లికార్జునరావు, అల్లూరి సీతారామరాజు స్మారక కళా వేదిక ప్రతినిధులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాస్ మరియు బుద్ధ అంబేడ్కర్ సమాజ్ తరపున తథాగతుడు గౌతమ బుద్ధుని తల నరికిన ఉన్మాద దుర్ఘటనపై విచారణకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి, నిందితులను గుర్తించి, తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ నిరసన .




**చిత్తూర్ జిల్లా ప్రతినిధి 4 జులై (రిపబ్లిక్ న్యూస్ ):**
అన్నమయ్య జిల్లా, మదనపల్లె రూరల్ మండలం, అంకిశెట్టిపల్లి సమీపంలోని బుద్ధునికొండపై గత 21 సంవత్సరాలుగా "నిర్వాహణలో వున్నా బుద్ధ విహారను మానవ వికాస కేంద్రంగా, ఆధ్యాత్మిక చైతన్య ప్రదేశంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో రెండు కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేసి, అభివృద్ధి పనులు జరుగుతున్నవి, ఇలా ఉండగా కొంతమంది ఉన్మాదులు పని గట్టుకొని ఒక్కొక్కటి ద్వంసం చేస్తున్నారు. గతంలో గౌతమ బుద్ధుని మూడు విగ్రహాలను, సీసీ కెమోరాలను, వాటర్ పైప్ లైన్ ను ధ్వంసం చేసినప్పుడు విహారా నిర్వాహకులు, దీనిపై మదనపల్లె రూరల్ పోలీస్ స్టేషన్ నందు రెండు కేసులు నమోదు చేశారు, ఈ కేసుల్లో పోలీసులు సరిగ్గా స్పందించలేనందున్నా ఉన్మాదులు మరింత బరితెగించి ఇప్పుడు నాలుగోసారి బుద్ధుని మరో విగ్రహాన్ని నిలువెత్తు పీఠంపై నుండి కిందకు తీసేసి,ధ్వంసం చేసి, తంగళాన్ సినిమాలో లాగా తల నరికి, తల మొండెం వేరు చేసి, తలను చేతిలో ఉంచి అమానుషంగా ప్రవర్తించారు. ఈ దుర్ఘటనపై నిర్వాహకులు స్థానిక పోలీసు అధికారుల స్పందన ఏమాత్రం సమంజసంగా లేదు అంటూ ఈ రోజు చిత్తూర్ దర్గా చౌక్ వద్ద వున్నా అంబేద్కర్ విగ్రహం ఎదురుగా నిరసన తెలిపారు, బుద్ధ విహార నిర్వాహకులైన వారి వద్ద పిర్యాదు తీసుకోలేదంటూ,విచారించునులేదు. స్థానిక వి.ఆర్.ఓ వద్ద పిర్యాదు రాయించుకొని నామ మాత్రపు కేసు నమోదు చేశారు అన్నారు . నిర్వాహకులు అనుమానితుల పేర్లు వెల్లడించినా పోలీస అదికారులు పట్టించుకోలేదు అంటూ బుద్ధుని తల నరికిన ఉన్మాదులను కాపాడేందుకు పోలీసులే ప్రయత్నిస్తున్నారంటు భారతీయ అంబేద్కర్ సేనా శ్రేణులు రిపబ్లిక్ మీడియా తో అన్నారు, గతంలో నమోదు చేసిన కేసులను ఎలా నీరుగార్చారో, అదే రీతిలో ప్రస్తుత కేసును కూడా నీరుగార్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారంటు స్థానిక పోలీసులు తమ ఇన్వెస్టిగేషన్ లో అసలు నిందితుల్ని గుర్తిస్తారన్న నమ్మకం ఏమాత్రం తమకు కావున తమ విన్నపంపై కలెక్టర్ గారు సానుకూలంగా స్పందించి, బుద్ధుని తల నరికిన ఈ దుర్ఘటనపై విచారణకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి, ఉన్మాదులను గురించి, కఠినంగా శిక్షిందాలని సవినయంగా విజ్ఞప్తి చేస్తు అర్జీ సమర్పించారు, ఈ కార్యక్రమంలో భారతీయ అంబేద్కర్ సిన జిల్లా ఉపాద్యకులు దేవా, జిల్లా కోశాధికారి ఏసు, అరవింద్, బి.ఎస్.ఎస్ జిల్లా ఉపాధ్యకులు పార్థసారథి, సచిన్ తదితరులు పాల్గొన్నారు

# కొడంగల్ నియోజకవర్గం లో

# నూతన పోలీస్ స్టేషన్ల నిర్మాణం

## శంకుస్థాపన,భూమి పూజ చేసిన డిజిపి

**యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి -డిజిపి జితేందర్**







**కొడంగల్, జూలై 4 (రిపబ్లిక్ న్యూస్)**
మత్తుకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోకూడదని యువతకు(డిజిపి ) డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జితేందర్ పేర్కొన్నారు.శుక్రవారం వికారాబాద్ జిల్లాలోని సీఎం సొంత నియోజకవర్గమైన కొడంగల్ నియోజకవర్గంలో 10 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించే పోలీస్ స్టేషన్ లకు భూమి పూజ శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర డిజిపి జితేందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.
పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, డిఐజి తాప్సీర్ ఎగ్బాల్, ఎస్పీ నారాయణరెడ్డి, హౌసింగ్ ఐజిపి రమేష్ లతో కలిసి డిజిపి జితేందర్ కొడంగల్ పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో నూతన పోలీస్ స్టేషన్లో కోసం శంకుస్థాపనలు , భూమి పూజ చేశారు. కొడంగల్ పోలీస్ స్టేషన్ 2.96 కోట్లు, సర్కిల్ పోలీస్ స్టేషన్ 84.50 లక్షలు, దుద్యాల పోలీస్ స్టేషన్ 3 కోట్లు, బొమ్మరాస్ పెట్ 2.96 కోట్ల వ్యయంతో నిర్మాణాలు చేపట్టే పనులకు డిజిపి శంకుస్థాపన చేసారు.అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ... ప్రజల సౌకర్యార్థం అధునాతన సౌకర్యాలతో పోలీస్ స్టేషన్ భవనాలను నిర్మిస్తున్నామన్నారు. కొడంగల్ పరిధిలో 10 కోట్ల వ్యయంతో నిర్మాణాలు చేపట్టే పోలీస్ స్టేషన్లకు శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. పోలీస్ స్టేషన్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొని వస్తామని తెలిపారు. అలగే రాష్ట్ర వ్యాప్తంగా మాదకద్రవ్యాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్ల తెలిపారు. ఇతర రాష్ట్రాల




నుండి మాదకద్రవ్యాల తరలింపు పై ప్రత్యేక నిఘాతో దోషులను గుర్తించడంతోపాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. యువత
చెడు వ్యసనాలకు గురి కావడం వల్ల కుటుంబాలు చెల్లాచెదురు అవుతున్నాయని, ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే అనర్ధానాలను తెలుసుకొని తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు.

# శాఖంబరి మాతగా శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు

**వాసవి మహిళా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఆషాడ గోరింటాకు సంబరాలు**
**వారాహి మాత కు ప్రత్యేక పూజలు**







**తాండూరు జూలై 4 (రిపబ్లిక్ న్యూస్)ం**
తాండూరు పట్టణంలోని నగరేశ్వర దేవాలయంలో కొలువుదీరిన శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మ వారికి ఆషాడ మాసం సందర్భంగా శాకంబరి మాత గా శుక్రవారం ప్రత్యేకంగా అలంకరించారు. వేకువ జామున అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వాసవి మహిళలు, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో తీసుకొని వచ్చిన వివిధ రకాల పండ్లు,కూరగాయలతో కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. దీంతో అమ్మవారు పూర్తిగా శాఖంబరి మాతగా మరి భక్తులకు దర్శనం ఇచ్చారు. అదేవిధంగా దేవాలయంలో వారహి మాతను కూడా ప్రతిష్టించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆర్యవైశ్య సమాజం సభ్యులు, వాసవి మహిళా సంఘం సభ్యులు కుటుంబీకులు ప్రత్యేకంగా దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు అదేవిధంగా మహిళలు గోరింటాకు సంబరాలను నిర్వహించారు. మహిళలు ఒకరికి ఒకరు అరచేతిలకు గోరింటాకు పెట్టుకొని ఆషాడ గోరింటాకును సంబరాలులను ఉత్సవంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా వాసవి మహిళా సంఘం సభ్యులు మాట్లాడుతూ ఆషాడ మాసంలో అమ్మవారిని ఇలా పూజించడం వల్ల చేపట్టిన పనులు అన్నిరంగాలలో విజయాలు కలిగి, కోరికలు నెరవేరుతాయని, అమ్మవారి



కరుణాకటాక్షాలతో సర్వ శుభాలు కలుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్లు కోటిగా విజయలక్ష్మి, స్వప్న పరిమల్, మరియు వాసవి మహిళా సంఘం అధ్యక్షురాలు కోట్రిక నాగలక్ష్మి, కార్యదర్శి మంకాల స్వప్న కోశాధికారి శోభ, మరియు మహిళా సభ్యులు, ఆర్యవైశ్య సంఘం పెద్దలు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో

# దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలు



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, జులై 04 ( రిపబ్లిక్ న్యూస్)** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరవీరుడు దొడ్డి కొమురయ్య 79 వ వర్ధంతి వేడుకలు జగిత్యాల జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించి, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దొడ్డి కొమురయ్య పోరాటపాటిమను కొనియాడారు. భూమికోసం, భుక్తి కోసం, తాడిత, పీడిత జనాల విముక్తి కోసం తెలంగాణ సాయుధ రైతాంగ ఉద్యమంలో పోరాడి అసువులు బాసిన తెలంగాణ తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య అని, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని, ప్రస్తుతం రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల పై జరుగుతున్న అరాచకాలను, కుట్రలను తిప్పి కొట్టాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, బీసీ న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు కూర్మాచలం ఉమా మహేష్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎలుక భగవాన్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు తిరుపురం రామచందర్, రాచకొండ రోజా,, రాపర్తి రవి, బొమ్మిడి నరేష్, అనుమల్ల సంజయ్ సామ్రాట్, దండుగుల వంశీ, గుంటి గంగారాం,బండ పెల్లి మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.




# సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై05రిపబ్లిక్ న్యూస్**
మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాల్లో ఉపాధి హామీ పనులు అమలు చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు నిలిపివేయడంతో కూలీలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ధర్నాలు జిల్లా అధ్యక్షుడు రామ్ చందర్, కార్యదర్శి నర్సింలు కూలీలు పాల్గొన్నారు

# మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై05రిపబ్లిక్ న్యూస్**నారాయణఖేడ్ నియోజకవర్గం నాగల్ గిద్ద మండలం కరస్ గుత్తి మాజీ సర్పంచ్ అశోక్ రావు పాటిల్ గారి సతీమణి అనారోగ్యంతో ఆసుపత్రులు చికిత్స పొంది ఇంటికి వచ్చిన విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్న నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి లి వారితోపాటు మండల పార్టీ అధ్యక్షులు పండరి నాయకులు సంజీవ్ కుమార్, సంగప్ప, తదితరులు ఉన్నారు.

# "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ "

**భారీ బహిరంగ సభకు బయలుదేరిన సిరికొండ మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు**



**సిరికొండ 04 జులై ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )** సిరికొండ మండల కేంద్రం నుండి "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్" కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల ఆత్మీయ సమ్మేళనం హైదరాబాద్ లోని ఎల్బీస్టేడియంలో సభకు సిరికొండ మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కార్యకర్తలు మరియు సీనియర్ నాయకులు హాజరయ్యారు. బోథ్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే. గజేందర్ ఆదేశాల మేరకు సిరికొండ మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎక్స్ ఎంపిటిసి బగునూరే. మాధవ్ పటేల్ , ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్స్ పూర్క. జంగుబాపు, చౌహన్. ప్రకాష్,దుర్వ. ఆనంద్ రావ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్. ఇమామ్, జనరల్ సెక్రెటరీ బొడ్డు. నవీన్, పొన్న సర్పంచ్ కానిందే.విజయ్ కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షులు అత్తి. రమేష్, ఎస్టీ సెల్ అధ్యక్షులు చౌహాన్. ప్రవీణ్, చౌహన్. కిషన్ పటేల్, జింక. మల్లేష్, బారిక్ రావు, కుడిమేత. కిషన్, ఇ.ఎల్లయ్య, జాదవ్. గణేష్,వివిధ గ్రామాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# కళాశాల విద్యార్థులు డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**- జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి నారాయణ**

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, జులై 04( రిపబ్లిక్ న్యూస్)**
ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని,విద్యార్థులు డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జగిత్యాల జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి బొప్పరాతి నారాయణ అన్నారు. శుక్రవారం మల్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.. ఈ సందర్భంగా పలు రికార్డులను, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో



సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తరగతులకు రెగ్యులర్ గా హాజరు కావాలన్నారు. విద్యార్థులు డ్రగ్స్, గంజాయి లాంటి మత్తుమందు పదార్థాలకు దూరంగా ఉండాలని, లేనిచో భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే నేర ప్రవృత్తి పెరుగుతుందన్నారు. విద్యాబోధనలో నాణ్యత కోసం అన్ని కళాశాలల్లో ప్రతి తరగతి గదిలో సీసీ కెమెరాలు అమర్చడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ జి. శ్రీవాణి అధ్యాపకులు అత్తినేని శ్రీనివాస్, యముల శ్రీనివాస్, మహమ్మద్ నవాబ్, వేనపెల్లి సంధ్య, పురాణం శ్రీధర్, బాసని నరేష్, దమ్మయ్య గారి శ్రీకాంత్, గగడం రచన, కేశవేణి శ్రీనివాస్, నగునూరి పూర్ణిమ, కడారి అనూష, లైబ్రేరియన్ ఆవారి సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు..ం

# రాష్ట్ర బిజెపి అధ్యక్షుని కి శుభాకాంక్షలు తెలిపిన తాండూరు బిజెపి నేతలు

**రాంచంద్రరావు నేత్రుత్వంలో కాషాయపు జెండా ఎగురేస్తాం.**
**బిజెపి నేత యు. రమేశ్ కుమార్**

**వికారాబాద్ జిల్లా జూలై 4 (రిపబ్లిక్ న్యూస్)**
నూతన రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు రామచంద్ర రావు ను తాండూరు బిజెపి నేతలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతనంగా ఎన్నుకోబడ్డ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచంద్రం రావు ని శుక్రవారం తాండూర్ బీజేపీ నేతలు తార్నాక లోని వారి నివాసం లో కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు.



రానున్న రోజుల్లో నిర్వహించే అన్ని ఎన్నికలలో ఎన్.రాంచంద్రం రావు నేతృత్వంలో బిజెపి జెండా ను ఎగురవేస్తామని తాండూరు బీజేపీ నేతలు అన్నారు. రాష్ట్ర అధ్యక్షుని కలిసిన వారిలో
రమేశ్ కుమార్ తొ పాటు శాంతకుమార్, కృష్ణ ముదిరాజ్, అంతారం లలిత, బంటారాం భద్రశ్వర్, నాగారం మల్లేశం, వీరేశం, జగన్ ముదిరాజ్, దోమ కృష్ణ, మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

# తెలంగాణ తొలి విప్లవ వీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి

**సందర్భంగా ఘన నివాళులు అర్పించినా మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి**





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై05రిపబ్లిక్ న్యూస్**
నారాయణ ఖేడ్ నియోజకవర్గం నారాయణఖేడ్ పట్టణంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యేతెలంగాణ చరిత్ర తొలి విప్లవ వీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతితెలంగాణ సాయుధ రైతు పోరాట వీరుడు, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య గారి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించినా మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ,ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్ నాయక్,కురుమ సంఘం తాలూకా ఉపాధ్యక్షులు మల్గొండ మాజీ సర్పంచ్ రాజు నాయక్, పోచయ్య, సంతోష్ కురుమ, నర్సింలు, మల్లేష్,శ్రీను నాయకులు తదితరులు ఉన్నారు.

# కంది సెంట్రల్ జైల్ తనిఖీ చేసిన సంగారెడ్డి జిల్లా జడ్జి

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై05రిపబ్లిక్ న్యూస్**
సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలో
కంది లోని సెంట్రల్ జైలును జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య శుక్రవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీల బ్యారక్, వంటగదులను పరిశీలించారు. అవసరమైన ఖైదీలకు ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని చెప్పారు. ఖైదీల ములాఖత్ ల గురించి అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జైలు అధికారులకు సూచించారు.



# బదిలీపై వెళ్తున్న జిల్లా సాయుధ బలగల అడిషనల్ ఎస్పి చంద్రబాబు

## ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించిన జిల్లా ఎస్పీ

**విధి నిర్వహణలో నంద్యాల జిల్లా పోలీసు యంత్రాంగం అందించిన సహకారం మరువలేను -అడిషనల్ ఎస్పీ చంద్రబాబు**







**నంద్యాల క్రైం, జూలై 4, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా సాయుధ బలగాల అడిషనల్ ఎస్పీగా చంద్రబాబు సుమారు రెండు సంవత్సరాల ఏడు నెలలు జిల్లాకు సేవలు అందించి ఏపీ జెన్కో విజయవాడకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాల్ నందు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం నందు బదిలీపై వెళ్తున్న అడిషనల్ ఎస్పీ చంద్రబాబుని జిల్లా ఎస్పీతో పాటు నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ మంద.జావళి ఆల్ఫోన్స్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు, ఆళ్లగడ్డ డిఎస్పి ప్రమోద్ గారు, నంద్యాల టౌన్ లోని ఇన్స్పెక్టర్లు, ఏఆర్ అధికారులు వారి సిబ్బంది పూలమాలలో పుష్పగుచ్ఛములతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా సాయుధ బలగాలకు అడిషనల్ ఎస్పీగా ఉన్న చంద్రబాబు బదిలీపై వెళ్లడం కొంత బాధ కలిగిస్తున్నప్పటికీ కుటుంబానికి దగ్గరగా ఉంటూ విధులు నిర్వహించడం సంతోషాన్ని కలిగిస్తుందని తెలియజేశారు. 1991 ఆర్. ఎస్ఐగా రిక్రూట్మెంట్ అయినప్పటి నుండి ఎస్.పి.ఎఫ్, స్టేట్ ఇంటెలిజెన్స్ గ్రేహౌండ్స్, విజయవాడ సిటీ డీఎస్పీ ఏఆర్ శ్రీకాకుళం, హోంగార్డ్ డిఎస్పీగా విధులు నిర్వహించడం జరిగింది. ఏఆర్ అడిషనల్ ఎస్పీగా ప్రమోషన్ పొంది 2022 జిల్లా సాయుధ బలగాల అడిషనల్ ఎస్పీగా ఛార్జ్ తీసుకున్నప్పటి నుండి ఇప్పటివరకు తనకు అప్పగించిన బాధ్యతలను నిక్కచ్చిగా, నిర్మొహమాటంగా నిర్వహించడం చాలా సంతోషాన్ని కలిగించిందని తెలియజేశారు. జిల్లాలో ఏఆర్ సిబ్బంది తక్కువగా ఉన్నప్పటికీ అన్ని పండుగల బందోబస్తు విధులు, వీఐపీ బందోబస్తులలో జిల్లాలోని ఫ్యాక్షన్ పికెట్ లలో సిబ్బంది కొరత లేకుండా చక్కగా అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విధులు నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ మాట్లాడుతూ చంద్రబాబు గారితో పాటు నేను కూడా చాలా సందర్భాల్లో కలిసి పనిచేయడం జరిగిందని అధికారులు తనకు అప్పగించిన బాధ్యతల నుండి ఏనాడు వెనకంజ వేయలేదని, నిక్కచ్చిగా నిజాయితీగా పనిచేసే అధికారిగా మంచి పేరు అధికారుల నుండి సంపాదించుకోవడం జరిగిందని, చంద్రబాబు గారితో పనిచేసిన అనుభవాలను అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు గుర్తుచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ డిఎస్పి ప్రమోద్ కుమార్, నంద్యాల టౌన్ ఇన్స్పెక్టర్లు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ అధికారులు రిజర్వ్ ఇన్స్పెక్టర్లు సబ్ ఇన్స్పెక్టర్లు ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాత్రి వేళలో నంద్యాల పట్టణ కేంద్రంలో

## ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన జిల్లా ఎస్పీ

**జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక,చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణే లక్ష్యం**

**రాత్రి వేళలో అనవసరంగా తిరిగే ఆకతాయిలపై చర్యలు**

**సమయపాలన పాటించని వ్యాపార సముదాయాలు, బార్లు/ వైన్ షాపులపై చర్యలు తీసుకుంటాం**

**ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా**





**నంద్యాల క్రైం, జూలై 4, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా నంద్యాల పట్టణ కేంద్రంలో అర్ధరాత్రి వేళ మోటార్ సైకిల్ పై ప్రయాణించి రాత్రివేళ గస్తీని పర్యవేక్షించి సమయపాలన పాటించని, అనుమానం ఉన్న వ్యాపార సముదాయాలు, బార్లు/ వైన్ షాపులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శ్రీనివాస్ సెంటర్, గాంధీ చౌక్, బంగారు అంగళ్ళ వీధి, హరిజన పేట పెద్ద బండ, బాలాజీ కాంప్లెక్స్, ఆర్టీసీ బస్టాండ్, విక్టోరియా రీడింగ్ రూమ్, బైరమల్ వీధి మొదలకు ప్రాంతాల్లో రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మున్సిపల్ ఆఫీస్, సంజీవనగర్ గేట్, ఎస్బిఐ కాలనీ, చిన్న చెరువు కట్ట, సింగ్ కాలనీ, టేక్కే, రెవిన్యూ క్వార్టర్స్ మొదలగు ప్రాంతాలలో, మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో దేవ నగర్, విసి కాలనీ, ఎస్పీజీ గ్రౌండ్, చామకాలువ, ఎంఎస్.నగర్, రైల్వే స్టేషన్, మూల సగరం,బొమ్మల సత్రం తదితర ప్రాంతాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాత్రి వేళలో నంద్యాల పట్టణ కేంద్రంలోని పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి, షాప్ లను మూసివేయించడం, అర్ధరాత్రి తిరుగుతున్న ఆకతాయిలను ప్రశ్నిస్తూ, ఈ వేళలో తిరగడానికి గల కారణాలు, అనవసరంగా తిరిగే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. రాత్రి పూట నేర నియంత్రణలో భాగంగా అనుమానం ఉన్న ఉన్న షాపులలో తనిఖీలు నిర్వహించడం,సమయపాలన పాటించని వ్యాపార సముదాయాలు, బార్లు, వైన్ షాపుల తనిఖీలు చేసి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరాదని, సమయపాలన పాటించాలని లేనియెడల చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పట్టణ శివారు ప్రాంతాలలో పర్యటించి బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిపై చర్యలు, రాత్రివేళ మద్యం సేవించి అనవసరంగా తిరిగే ఆకతాయిలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అసాంఘీక కార్యకలాపాలు, గంజాయి అక్రమ మద్యం, పీడీఎస్ రైస్ ఇసుక, ఇతర చట్ట వ్యతిరేక అక్రమ రవాణాను అరికట్టుట కొరకు వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాత్రివేళ గస్తీ నిర్వహించే సిబ్బంది, పోలీస్ అధికారులతో మాట్లాడుతూ రాత్రి వేళలో అనుమానితులను తప్పక ప్రశ్నించాలని,వారి చిరునామా, పూర్తి వివరాలు రికార్డు చేయాలని ఆదేశాలు.రాత్రి పూట ప్రజల భద్రత, రక్షణకు జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా గస్తీ నిర్వహిస్తూ ఎలాంటి దొంగతనాలు అల్లర్లు జరగకుండా చూసుకోవాలి. గస్తీ సమయంలో తాళాలు వేసిన ఇళ్ళు, రైల్వే స్టేషన్, బస్టాప్ లు, ఆలయాలు, బ్యాంక్లు, ఎ.టి.యంలు, అన్ని ముఖ్యమైన కూడళ్ళలో మరియు నిర్మానుష్యమైన ప్రదేశాలు, నేర చరిత్ర గలిగిన పాత నేరస్తులు, రౌడీలు, సస్పెక్ట్ లపై నిఘా ఉంచాలి. ఎప్పటికప్పుడు జిల్లా సమాచారాన్ని అలెర్టింగ్ అధికారికి వివరిస్తూ తదనుగుణంగా సూచనలు స్వీకరించాలి. రాత్రి గస్తీ వేళలో ప్రయాణించే మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలకు ఏమైనా రక్షణ సహాయం అవసరమైతే భరోసా కల్పిస్తూ, తోడ్పాటును అందించాలి. వాహనాలకి ఉన్న పోలీస్ సైరన్ లను మోగించుకుంటూ బీట్స్ తిరగాలని, ప్రతి బీట్ సిబ్బంది వద్ద విజిల్ కార్డ్, టార్చ్ లైట్ తప్పక ఉండాలని ఆదేశించారు. రాత్రి పూట గస్తీ నిర్వహించే పోలీస్ సిబ్బంది, అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వారిపై శాఖాపరమైన కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# ప్రజా దర్బార్ నిర్వహించిన

## న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్





**నంద్యాల.. జిలై..04 (రిపబ్లిక్ న్యూస్)**నంద్యాల అబాండం తాండ (సుగాలి మెట్ట) నందు నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక "ప్రజా దర్బార్ " అన్నారు పలు రకాల సమస్యలతో వచ్చిన వారి నుండి అర్జీలను స్వీకరించి, ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మార్క్ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి , అబా%శీ%డం తాండ టిడిపి అధ్యక్షులు , నంద్యాల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ , టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి డుమావత్ స్వామి నాయక్ , ఎమ్మార్వో , ఎంపీడీవో , ప్రభుత్వ అధికారులు , నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హరిబాబు , కొట్టాల శివ నాగిరెడ్డి , నంద్యాల మండలం కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి , కేసీ కెనాల్ చైర్మన్ చాబోలు ఇలియాజ్ , ప్రేమ్ నాథ్ రెడ్డి , సర్పంచ్ నారాయణ , రాజేష్ , గోవింద నాయుడు , మండ్ల గుర్రప్ప , కట్టెల డిపో గఫార్ , రమేష్ నాయక్ , విజయ్ నాయక్ , కార్తీక్ నాయక్ , గ్రామ పెద్దలు , మహిళలు , సచివాలయ సిబ్బంది మరియు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



## శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో

# బ్యాంకింగ్ ఉద్యోగాలపై అవగాహన




**పాణ్యం,ప్రతినిధి, జులై 04,(ప్రజా రిపబ్లిక్ న్యూస్),** స్థానిక మండలం లోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ మరియు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బ్యాంకింగ్ ఎగ్జామ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం వి సుబ్రహ్మణ్యం తెలిపారు. బ్యాంకింగ్ పరిశ్రమ అద్భుతమైన ఉద్యోగ భద్రత మరియు వృత్తిపరమైన వృద్ధికి అనేక మార్గాలతో ఎంట్రీ-లెవల్ పదవుల నుండి ఎగ్జిక్యూటివ్ పాత్రల వరకు విస్తృత శ్రేణి కెరీర్ అవకాశాలను అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు బ్యాంకింగ్ రంగంలో ఉన్న పిఓ మరియు క్లర్క్ తెలుగు ఉద్యోగాలకు సంబంధించినటువంటి అవగాహనను స్థానిక నంద్యాల బ్రాంచ్ మేనేజర్ వెంకటేష్ , చీఫ్ మేనేజర్ నవీన్ , ఆర్బిఓ శ్రీధర్ విద్యార్థులకు సూచించారు. ప్రతి ఒక్కరూ సాఫ్ట్వేర్, మల్టీ నేషనల్ కంపెనీస్ మొదలగు వాటితోపాటు బ్యాంకింగ్ రంగంలోనూ రాణించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నాగరాజు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# నంద్యాల పట్టణ ప్రజలందరికీ, ముస్లీం సోదరులకి మొహరం నూతన సంవత్సర శుభాకాంక్షలు..

**జన సేనా నాయకులు రాచమడుగు చందు,మరయు బ్రదర్స్..**





**నంద్యాల.. జులై..05 (రిపబ్లిక్ న్యూస్)**ప్రతి ఏడాది ముస్లిం సోదరులు దేశవ్యాప్తంగా ఘనంగా మొహరం పండుగ ను ముస్లీం సోదరులు నూతన సంవత్సరంగా భావించి వీరుల త్యాగాలకు ప్రతీకగా నిర్వహించే మోహరం పండుగను ఐదు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో మొహరం పండుగను జరుపుకుంటారు.ఈ సందర్భంగా ఈ రోజు నంద్యాల జనసేనా నాయకులు రాచమడుగు చందు,వారి సోదరులు రాచమడుగు రాంబాబు తో పాటు జనసైనికులు బైర్మల్ స్ట్రీట్ లో కొలువైన పీర్ల హజరత్ ఇమామ్ ఖాసీం, ఇమామ్ హుస్సేన్,అలీ అబ్బాస్ పీర్ల ను దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో జనసేనా నాయకులు రాచమడుగు చందు,వారి సోదరులు రాచమడుగు రాంబాబు మాట్లాడుతూ ముస్లిం సోదరులకందరికి నూతన సంవత్సరమైన మొహరం పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.పీర్ల పండుగను ప్రతిఒక్కరూ భక్తి శ్రద్ధలతో కులమతాలకు అతీతంగా అందరూ భక్తిభావంతో పూజలను నిర్వహిస్తారని,ఇలాంటి వేడుకలను జరుపుకుంటారని ఇది చాలా మంచి పరిణామం అని ముమ్మందు అందరూ కూడా ఇదే విధంగా కులమతాలకు అతీతంగా ప్రతి పండుగను మనమందరం వేడుకగా నిర్వహించుకోవాలని అందరికీ భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలని అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నట్టున్నానని నంద్యాల జనసేనాపార్టీ నాయకులు రాచమడుగు చందు, రాచమడుగు రాంబాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో శివ శేఖర్,బాబా ఫక్రుద్దీన్,చిన్నా తదితరులు పాల్గొన్నారు.

## మహానంది రాజగోపురం వద్ద నల్లనాగు



**మహానంది, జూలై 4 , (రిపబ్లిక్ న్యూస్)**

మహానంది దేవస్థానంలోని రాజగోపురం ఆలయ మహా ద్వారం ముందు గురువారం రాత్రి నల్ల నాగుపాము ప్రత్యక్షమైంది. రాత్రి 9:30 గంటలకు గుడి తలుపులు మూసివేయగా సుమారు 11 గంటల ప్రాంతంలో అక్కడే విధులు నిర్వహిస్తున్న హోంగార్డు నాయక్, సిబ్బంది పామును గుర్తించారు. ఇదిలా ఉండగా భక్తులు లేని సమయంలో పాము రావడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

## మహానందిలో ఆదివారం తొలి ఏకాదశి వేడుకలు



మహానంది, జూలై 4,(రిపబ్లిక్ న్యూస్)

తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని మహానందిలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మహానందిలో కొలువైన శ్రీ మహానందీశ్వర స్వామి, శ్రీ కామేశ్వరీ దేవి మూల మూర్తులకు, ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, తిరుమంజనం వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఏకాదశి రోజున స్వామి, అమ్మవార్లకు కేవలం ఫలాలు మాత్రమే నివేదనగా సమర్పిస్తామని చెప్పారు. ఆలయ శుద్ధి పూజలు ఉంటాయన్నారు.

## వర్షం ఎఫెక్ట్... మహానందీశ్వర పల్లకీసేవ రద్దు



**మహానంది, జూలై 4, (రిపబ్లిక్ న్యూస్):**నంద్యాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. మహానంది పుణ్యక్షేత్రంలో ప్రతి సోమవారం, శుక్రవారం నిర్వహించనున్న పల్లకీ సేవ కార్యక్రమం శుక్రవారం రాత్రి రద్దు చేసినట్లు వేద పండితులు రవిశంకర్ అవధాని తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి ఆయన మాట్లాడుతూ మహానంది ఆలయ పరిసరాల్లో వర్షం కురుస్తున్న కారణంతో పల్లకీ సేవను రద్దు చేసినట్లు చెప్పారు.



## మహానందిలో కడప జిల్లా స్క్వాడ్ ఎఫ్ఆర్ఓ పూజలు

**మహానంది, జూలై 4, (రిపబ్లిక్ న్యూస్):** మహానందిలో అటవీశాఖ కడప జిల్లా స్క్వాడ్ ఎఫ్ఆర్ఓ మదన్ మోహన్ రెడ్డి శుక్రవారం పూజలు చేశారు. శ్రీ మహానందీశ్వర స్వామి దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఇన్స్పెక్టర్ నాగమల్లయ్య స్వాగతం పలికారు. ఆయన శ్రీ కామేశ్వరి దేవి, శ్రీ మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. దర్శనం అనంతరం వారికి స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com